# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 133, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శనివారం -26 - జూలై - 2025




ఏపీ, తెలంగాణ డీలిమిటేషన్ పిటిషన్‌ను

## కొట్టివేసిన సుప్రీంకోర్టు

రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్‌పై పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం

## మోదీ విదేశీ పర్యటనలు.. మూడేళ్లలో రూ.295 కోట్ల ఖర్చు



ఒక్క ఫ్రాన్స్ పర్యటనకే రూ.25 కోట్లు

ఇటీవలి ఐదు దేశాల పర్యటనకు రూ.67 కోట్లు

రాజ్యసభలో కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడి

కాంగ్రెస్‌ది పనికి రాని సర్వే..

## రేవంత్‌వి పిల్లి మొగ్గలు



75 ఏళ్ల చరిత్రలో కాంగ్రెస్ ఏనాడు బీసీ జనగణన చేయలేదు

బీసీలను కాంగ్రెస్ మభ్యపెడుతోంది

'దేశానికి అత్యధిక కాలం పని చేసిన రెండో ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు

42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం అమలు చేయడంలో ఫెయిల్ అయ్యింది



## సీఎం రేవంత్‌రెడ్డిలో అపరిచితుడు ఉన్నాడు: కేటీఆర్

దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడతాం

హైదరాబాద్ నడి బొడ్డున ప్రపంచంలోనే అత్యధిక ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టింది కేసీఆరే

మాటిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పింది"

# తెలంగాణ సర్వే దేశానికే రోల్ మోడల్..ఇది 'రేర్' సర్వే

బీసీ రిజర్వేషన్ బిల్లులపై కాంగ్రెస్ ఎంపీలకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

తనతోపాటు, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు జంతర్ మంతర్ వద్ద పోరాడతామని వెల్లడి

రాష్ట్రంలో కులగణన సర్వేకు సంబంధించి మా వద్ద 88 కోట్ల పేజీల డేటా ఉంది

సర్వే ప్రకారం తెలంగాణలో బీసీలు 56.36 శాతం ఉన్నారు

3.9 శాతం మంది తమది ఏ కులం కాదని ప్రకటించుకున్నారు.. ఇదొక సరికొత్త పరిణామం



## రాహుల్ హామీ మేరకు రాష్ట్రంలో కులగణన

'భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ కుల గణనకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మేము అధికారంలోకి వచ్చిన తర్వాత 2024, ఫిబ్రవరి 4వ తేదీన ఈ మేరకు సర్వేను ప్రారంభించి 2025, ఫిబ్రవరి 5న అంటే ఏడాది కాలంలోనే పూర్తి చేశాం. అందుకే ఫిబ్రవరి 4ను తెలంగాణలో సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. కులగణన చేపట్టే సమయంలో అనేకమంది అగ్ర కులాల నాయకులు నా వద్దకు వచ్చి అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తం చేశారు. కాలనుగుణంగా మార్పులకు అవకాశం ఇవ్వాలని నేను వారికి సూచించా. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 60 ఏళ్ల పాటు పోరాటాలు జరిగాయి. అనేక మంది అమరులయ్యారు. కానీ 2009, డిసెంబర్ 9న ప్రకటన చేయడంతో పాటు తెలంగాణ ఇచ్చి తెలంగాణ ప్రజల కలను సోనియాగాంధీ నెరవేర్చారు. అదే తెలంగాణలో కుల గణనపై రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని మా ప్రభుత్వం నెరవేర్చింది..' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీ హామీ మేరకు తమ ప్రభు త్వం కుల గణన చేసి, ఆ మేరకు బీసీలకు 42 శాతం రిజ ర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ బిల్లులను లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదింపజేసేందుకు రాహుల్‌గాంధీ, ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ ఎంపీలు పోరాడాలని విజ్ఞప్తి చేశారు. తాను, తన మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలందరం జంతర్‌మంతర్ వద్ద పోరాడతామని చెప్పారు. మిగతా..2లో

అదే జరిగితే ఎమ్మెల్యే పదవికి

## రాజీనామా చేస్తా: కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్చరిక



జీవో నెంబర్ 49ని తీసుకు వస్తే ఊరుకునేది లేదన్న ఖానాపూర్ ఎమ్మెల్యే

కవ్వాల్ టైగర్ జోన్‌లో రాకపోకలు నిలిపివేస్తే తరిమికొడతామన్న ఎమ్మెల్యే

పోడు రైతులు, అటవీ బిడ్డలపై ఆంక్షలు పెడితే సహించేది



తెలంగాణ క్యాబినెట్

## భేటీ వాయిదా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగాల్సి ఉంది

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో

నేనూ కొన్ని బంగారు కుటుంబాలను

# దత్తత తీసుకుంటా

## "పీ4 కార్యక్రమం ప్రజా ఉద్యమంలా సాగుతోంది

పేద కుటుంబాల సాధికారతే కూటమి ప్రభుత్వం లక్ష్యం.

పేదరికంపై చేస్తున్న పోరులో తనతో పాటు తన కుటుంబసభ్యులు కూడా భాగస్వాములు అవుతారు

రాష్ట్ర సచివాలయంలో జీరో పావర్టీ-పీ4పై సీఎం సమీక్ష





అమరావతి: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు తాను కూడా కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు. పేదరికంపై చేస్తున్న పోరులో తనతో పాటు తన కుటుంబసభ్యులు కూడా భాగస్వాములు అవుతారని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో జీరో పావర్టీ-పీ4పై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు వివిధ అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. "పీ4 కార్యక్రమం ప్రజా ఉద్యమంలా సాగుతోంది. పేద కుటుంబాల సాధికారతే కూటమి ప్రభుత్వం లక్ష్యం. మిగతా..2లో

## కోనేరు హంపి ప్రతిభ ప్రశంసనీయం



అమరావతి: భారత చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపికి సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్ చేరుకున్న సందర్భంగా అభినందనలు తెలిపారు. ఆమె దృఢ సంకల్పం, ప్రతిభ ప్రశంసనీయం, స్ఫూర్తిదాయకమన్నారు.

## కర్నూలు జిల్లాలో డ్రోన్ నుంచి క్షిపణి పరీక్ష.. ట్వీట్ చేసిన రాజ్‌నాథ్ సింగ్

కర్నూలులోని ఎన్‌ఓఏఆర్‌లో ప్రతిష్మాత్మక పరీక్ష




డీఆర్డీవో, క్షిపణి అభివృద్ధి భాగస్వాములను అభినందించిన రాజ్‌నాథ్ సింగ్

'ఎక్స్' వేదికగా ఫొటోను పంచుకున్న కేంద్ర మంత్రి

ప్రధానిగా ఇందిరాగాంధీ రికార్డు

## బద్దలు కొట్టిన మోదీ

ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు



ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా మోదీ

ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 4,078 రోజులు పూర్తి

ఇంతకుముందు ఈ రికార్డు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పేరిట



## వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి మంత్రి అనిత ఆదేశం

వాయుగుండం రానున్న 24 గంటల్లో ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ వైపు కదులుతుంది

ఆదివారం వరకు కోస్తాంధ్రలో అక్కడక్కడా భారీ వర్షాలు.. రాయలసీమ ప్రాంతంలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు



## రాజధాని నిర్మాణాల విషయంలో వైకాపా దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

రాజధాని అమరావతిలో క్వార్టర్స్, ఇతర భవనాల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి

నేలపాడులోని గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ అధికారుల క్వార్టర్ల పనులను పరిశీలన

గ్రూప్-డి అధికారుల నివాసాలు, హ్యాపీనెస్ట్ టవర్ల వద్ద పనులు జరుగుతున్న తీరుపై ఆరా

# తెలంగాణ సర్వే దేశానికే రోల్ మోడల్..ఇది 'రేర్' సర్వే

తాను, తన మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలందరం జంతర్‌మంతర్ వద్ద పోరాడతామని చెప్పారు. తెలంగాణలో తమ ప్రభుత్వం ఇంటింటికీ తిరిగి ప్రజల స్వీయ ధ్రువీకరణ పత్రంతో సేకరించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే దేశానికే రోల్‌మోడల్ అని అన్నారు. ఈ సర్వేకు సంబంధించిన 88 కోట్ల పేజీల డేటా తమ వద్ద ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో ఆమోదించిన బిల్లులపై..ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన సందర్భంగా సీఎం మాట్లాడారు.

గాంధీ కుటుంబం ఇచ్చిన మాట నిలుపుకుంటుంది

'బీజేపీ నాయకులు చెప్పినవి ఏవీ చేయరు. గాంధీ కుటుంబం చెప్పిన ప్రతి మాటను నిలుపుకుంటుంది. కుల గణనకు సంబంధించి మా ప్రభుత్వం 56 ప్రశ్నలతో ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి వద్దకు వెళ్లి సమాచారం సేకరించింది. సర్వే ప్రకారం తెలంగాణలో బీసీలు 56.36 శాతం ఉన్నారు. 3.9 శాతం మంది తమది ఏ కులం కాదని ప్రకటించుకున్నారు. ఇది తెలంగాణలో సరికొత్త పరిణామం. వీరంతా ఎవరని.. సర్వే, స్వతంత్ర నిపుణుల బృందాలు పరిశీలించాయి. వాళ్లంతా ఇంగ్లీష్ అభ్యసించిన ఉన్నత విద్యావంతులని తేలింది. ఈ సర్వే ప్రకారమే మేము బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు, విద్యా, ఉపాధి అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించాం..' ముఖ్యమంత్రి తెలిపారు.



మోదీ లీగల్లీ కన్వెర్టెడ్ బీసీ..

'బీజేపీ తొలి నుంచి బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లీగల్లీ కన్వెర్టెడ్ బీసీ. మేము కుల గణన చేపట్టబోమని రాజ్‌నాథ్ సింగ్ పార్లమెంటులో చెప్పారు. రైతుల నల్ల చట్టాల విషయంలో రాహుల్ గాంధీ గళం విప్పిన తర్వాత మోదీ వాటిని రద్దు చేసి క్షమాపణ చెప్పారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ మాట మేరకు తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టిన తర్వాత కేంద్రం కుల గణనకు అంగీకరించింది. ఇదంతా రాహుల్ గాంధీ ఘనతే. మేము చేపట్టిన సర్వే దేశానికి రోల్ మోడల్. ఇది తెలంగాణ మోడల్. నేను దీనిని 'రేర్' (ఆర్ఏఆర్ఈ) మోడల్ అంటున్నా. ఆర్ఏఆర్ఈ..అంటే ఏమిటో నేను త్వరలో వివరిస్తా..' అని రేవంత్ అన్నారు.

# ఏపీ, తెలంగాణ డీలిమిటేషన్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

హైదరాబాద్/అమరావతి: ఏపీ, తెలంగాణ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజనపై ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి 2022లో పిటిషన్ దాఖలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పునర్విభజన సమయంలో.. ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ రోజు విచారణ చేపట్టింది. రాజ్యాంగంలోని 170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలోని సెక్షన్ 26కు పరిమితి ఉందని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. 2026లో మొదటి జనగణన లెక్కల తర్వాతే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల మిగతా రాష్ట్రాల నుంచి కూడా నియోజకవర్గాల పునర్విభజనపై పిటిషన్లు



వచ్చే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. కేంద్రపాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాలలో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. జమ్మూకశ్మీర్‌పై ప్రత్యేక దృష్టిసారించారన్న వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. జమ్మూకశ్మీర్ కోసం జారీ చేసిన నియోజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్ నుంచి మినహాయించడం.. ఏకపక్షం, విపక్షం కాదని చెబుతూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

## సోనియా గాంధీ రాసిన లేఖ నాకు ఆస్కార్ లాంటిది

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తనను మెచ్చుకుంటూ లేఖ రాశారని, ఇది తనకు ఆస్కార్, నోబెల్ బహుమతి వంటిదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కులగణనను తెలంగాణ మోడల్ అని కాకుండా రేర్ మోడల్ అని కూడా అనవచ్చని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరూ కులగణన చేయలేదని, అందుకే రేర్ మోడల్ అనవచ్చని అభిప్రాయపడ్డారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎన్ని అభివృద్ధి, సంక్షేమ పనులు చేసినప్పటికీ, సోనియా గాంధీ రాసిన లేఖనే తనకు గొప్ప అని వ్యాఖ్యానించారు. మీది కాంగ్రెస్ పార్టీ కాకపోయినా ముఖ్యమంత్రి ఎలా అయ్యారని అందరూ అడుగుతున్నారని, అయితే రాహుల్ గాంధీ ఆత్మతో తన ఆత్మ కలిసిందని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ మనసులో అనుకున్న పనులను తాను చేయాలని సంకల్పించానని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన అనుకున్నవన్నీ తాను చేశానని, అందుకే ఇప్పుడు కులగణన విషయంలో తెలంగాణ మోడల్ గురించి దేశమంతా చర్చ జరుగుతోందని ముఖ్యమంత్రి అన్నారు. రాహుల్ గాంధీ ఏమైనా చెప్పారంటే అది తనకు బంగారు గీత అని స్పష్టం చేశారు.

## ప్రధానిగా ఇందిరాగాంధీ రికార్డు బద్దలు కొట్టిన మోదీ

ఢిల్లీ: ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించారు. ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. ఇవాళ్టితో ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 4,078 రోజులు పూర్తిచేసుకున్నారు. దీంతో దేశానికి ఏకబిగిన ఎక్కువ కాలం ప్రధానిగా పనిచేసిన రెండో వ్యక్తిగా నిలిచారు. దివంగత ఇందిరాగాంధీ 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు 4,077 రోజులు ప్రధానిగా ఉన్నారు. అయితే, దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదట ఆ రికార్డు సాధించిన విషయం తెలిసిందే. 2014, మే 26న నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జరిగిన రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆయన బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చారు. దీంతో వరసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీలకు విజయాన్ని అందించిన ఘనత నెహ్రూ, మోదీలకు దక్కింది అలాగే స్వాతంత్ర్యం తర్వాత జన్మించి అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన కాంగ్రెసేతర వ్యక్తిగా మోదీ రికార్డుకెక్కారు. లోక్‌సభలో రెండు సార్లు పూర్తిస్థాయి మెజార్టీతో అధికారంలో వచ్చిన కాంగ్రెసేతర పార్టీ నేతగా కూడా ఆయన చరిత్ర సృష్టించారు. ఇందిరాగాంధీ (1971) తర్వాత అత్యధిక మెజార్టీతో అధికారం చేపట్టిన ప్రధానిగా నిలిచారు. అటు, సీఎంగా, ప్రధానిగా దీర్ఘకాలం కొనసాగిన ఖ్యాతి మోదీకే చెందుతుంది. 2001 అక్టోబర్ 7న తొలిసారి గుజరాత్ సీఎం అయిన మోదీ.. 2014లో ప్రధాని అయ్యేవరకు ఆ పదవిలో కొనసాగారు. అప్పటినుంచి ప్రధానిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గుజరాత్ సీఎంగా 2002, 2007, 2012 ఎన్నికల్లో బీజేపీని గెలిపించారు. అదేవిధంగా 2014, 2019, 2024లో ప్రధాని అభ్యర్థిగా కమలం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. దాంతో దేశంలో సీఎంలు, ప్రధానమంత్రులందరిలో వరసగా ఆరు ఎన్నికల్లో ఒక పార్టీపక్ష నేతగా ఎన్నికైన ఏకైక నేతగా నరేంద్ర మోదీ రికార్డుకెక్కారు.

## సీఎం రేవంత్‌రెడ్డిలో అపరిచితుడు ఉన్నాడు: కేటీఆర్

కామారెడ్డి జిల్లా: దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడతామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండల కేంద్రంలో ఆత్మగౌరవ గర్జన సభలో మాట్లాడుతూ.. హైదరాబాద్ నడి బొడ్డున ప్రపంచంలోనే అత్యధిక ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టింది కేసీఆరే. 26 శాతం ఉన్న దళిత గిరిజనులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని మాటిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పింది" అని కేటీఆర్ దుయ్యబట్టారు. కేసీఆర్ కావాలో, కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలి. మీ నిర్ణయానికి మేము కట్టుబడి ఉంటాము.. రైతు రుణమాఫీ, 50వేల కోట్లు చెల్లించాల్సి ఉంటే 12వేల కోట్లు మాత్రమే చెల్లించారు. ఢిల్లీకి మూటలు.. తెలంగాణ ప్రజలకు మాటలు. ముఖ్యమంత్రిలో ఒక అపరిచితుడు ఉన్నాడు. ఒకరు రాము, మరొకరు రెమో.. ఇద్దరి మాటలకు పొంతన ఉండదు" అంటూ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏడాదికి 60 వేల ఉద్యోగాలు ఏమయ్యాయి?. కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులకు రిబ్బన్‌లు కట్ చేయడం తప్ప కాంగ్రెస్ ఏమీ చేయడం లేదు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బట్టలు విప్పండి. మిస్ వరల్డ్‌లో లక్ష రూపాయల చొప్పున సుందరంగులకు ప్లేట్ భోజనాలు పెట్టవు. మరి దళిత బిడ్డలు చదివే వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ అయి చనిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుంది" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.

## కాంగ్రెస్‌ది పనికి రాని సర్వే.. రేవంత్‌వి పిల్లి మొగ్గలు: కిషన్‌రెడ్డి

ఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ పనికిరాని సర్వే చేసిందని ఆరోపించారు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి. 75 ఏళ్ల చరిత్రలో కాంగ్రెస్ ఏనాడు బీసీ జనగణన చేయలేదు. బీసీలను కాంగ్రెస్ మభ్యపెడుతోంది అంటూ ఘాటు విమర్శలు చేశారు. బీసీని ప్రధానిని చేసిన ఘటన బీజేపీది అంటూ చెప్పుకొచ్చారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..'దేశానికి అత్యధిక కాలం పని చేసిన రెండో ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డు సృష్టించారు. బీసీలను కాంగ్రెస్ మభ్య పెడుతోంది. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం అమలు చేయడంలో ఫెయిల్ అయ్యింది. బీసీల్లో ముస్లింలను కలపడం వల్ల బీసీ వర్గాలకి అన్యాయం జరుగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీసీ సీట్లలో ముస్లింలకు పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రతిపాదించిన 42 శాతం రిజర్వేషన్లలో పది శాతం ముస్లింలకు ఇవ్వడం వల్ల నిజమైన బీసీలకు నష్టం జరుగుతుంది. 75 ఏళ్ల చరిత్రలో కాంగ్రెస్ ఏనాడు బీసీ జనగణన చేయలేదు. కాంగ్రెస్ పనికిరాని సర్వే చేసింది. బీసీలలో ముస్లింలను కలిపేలా కేంద్రం కుల గణన ఉండదు. బీసీలకు న్యాయం చేసేలా కుల గణన ఉంటుంది. కాంగ్రెస్ ఏనాడు బీసీ సీఎం, బీసీని ప్రధానిని చేయలేదు. బీసీని ప్రధానిని చేసిన చరిత్ర బీజేపీది. మోదీ కన్వర్టెడ్ బీసీ ఎలా అవుతారు?. కాంగ్రెస్ హయంలోనే మండల కమిషన్ ద్వారా మోదీ కులాన్ని బీసీల్లో చేర్చాలి. బీసీల్లో చేర్చినపుడు కనీసం మోదీ ఎమ్మెల్యే కూడా కాదు. రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అనేక కులాలు బీసీల్లో కలిశాయి. లంబాడాలను కూడా కన్వర్టెడ్ ఎస్టీ అంటారా?. తెలంగాణలో ఎన్నికలొస్తే కాంగ్రెస్ ఓటమి ఖాయం. కాంగ్రెస్ పాలిత మూడు రాష్ట్రాల లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా వారి ఓటమి ఖాయం. రాహుల్ గాంధీది ఏ సామాజిక వర్గమో చెప్పాలి. ఎన్నికైన ప్రధాని మోదీపై అవాకులూ చెవాకులూ పేలడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం. 42శాతం రిజర్వేషన్లు బీసీలకు మాత్రమే ఇవ్వాలి. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టేందుకు మాకు అభ్యంతరం లేదు కానీ చట్టానికి లోబడి ఉండాలి. మేము అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పూర్తిగా రద్దు చేస్తాం. మెట్రో విషయంలో రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తాను. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పిల్లి మొగ్గలు వేస్తున్నారు' అంటూ ఘాటు విమర్శలు చేశారు.

## నేనూ కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటా



రాష్ట్ర సచివాలయంలో జీరో పావర్టీ–పీ4పై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు వివిధ అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. "పీ4 కార్యక్రమం ప్రజా ఉద్యమంలా సాగుతోంది. పేద కుటుంబాల సాధికారతే కూటమి ప్రభుత్వం లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఎక్కడున్నా వారందరినీ ఈ కార్యక్రమంలో మమేకం చేయాలి. కార్పొరేట్ సంస్థలు కలిసి వచ్చేలా చూడటంతో పాటు సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత జిల్లాల కలెక్టర్లదే. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ ప్రాంతానికే చెందిన ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలి. బంగారు కుటుంబాల అత్యంత ప్రాధాన్యతలపై చేపట్టిన సర్వేను ఆగస్టు 10లోపు పూర్తిచేయాలి. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను 'మార్గదర్శులు' దత్తత తీసుకునేలా చూడాలి" అని సీఎం ఆదేశించారు. ఇప్పటి వరకు 5,74,811 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోగా.. 57,503 మంది మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం లక్ష్యం నెరవేరాలంటే మరో 2 లక్షల మంది మార్గదర్శుల అవసరం ఉందని తెలిపారు. పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా బంగారు కుటుంబాల దత్తత జరిగిందని.. విశాఖపట్నం జిల్లా చివరలో ఉందన్నారు. దత్తత తీసుకున్న కుటుంబాలకు ఆటోమేటెడ్ మెసేజ్ రూపంలో సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తున్నామన్నారు. సోషల్ మీడియా, ఇతర ప్లాట్ ఫామ్‌ల ద్వారా పీ4 కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తలపెట్టిన డిజిటల్ ప్రమోషన్ కార్యకలాపాల గురించి సీఎంకు అధికారులు వివరించారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి: మంత్రి అనిత ఆదేశం

విజయవాడ: బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని ఏపీ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నందున తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై విపత్తు నిర్వహణ ఎండీ ప్రఖర్ జైన్, సిబ్బందితో మంత్రి సమీక్ష నిర్వహించారు. వాయుగుండం రానున్న 24 గంటల్లో ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఝార?ండ్ వైపు కదులుతుందన్నారు. ఆదివారం వరకు కోస్తాంధ్రలో అక్కడక్కడా భారీ వర్షాలు.. రాయలసీమ ప్రాంతంలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే వీలుందని చెప్పారు. తీరం వెంబడి గంటకు 40–60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లోని తీర ప్రాంతాల్లో అలలు 2.9 నుంచి 3.6 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడే వీలుందని మంత్రి చెప్పారు. అత్యవసర సహాయక చర్యలకు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101ను సంప్రదించాలని సూచించారు. వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద హాట్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖలతో సమన్వయం చేసుకుని గండ్లు గుర్తించి చర్యలు తీసుకోవాలని మంత్రి అనిత ఆదేశించారు.

## రాజధాని నిర్మాణాల విషయంలో వైకాపా దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: మంత్రి నారాయణ

అమరావతి: రాజధాని అమరావతిలో క్వార్టర్స్, ఇతర భవనాల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి నారాయణ ఆదేశించారు. రాజధానిలో పర్యటించి ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. నేలపాడులోని గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ అధికారుల క్వార్టర్ల పనులను పరిశీలించారు. గ్రూప్–డి అధికారుల నివాసాలు, హ్యాపీనెస్ట్ టవర్ల వద్ద పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేలా కాంట్రాక్ట్ సంస్థలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా నిర్మాణ సంస్థలకు ఆదేశాలిచ్చామన్నారు. అమరావతి నిర్మాణం జరగడం లేదని వైకాపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. ఎవరూ అలాంటి ప్రచారం నమ్మొద్దు. వంద శాతం మూడేళ్లలో పూర్తిచేస్తాం. మొత్తం 4 వేల ఫ్లాట్ల నిర్మాణం వచ్చే మార్చి నాటికి పూర్తవుతుంది. ఇక్కడ ఉండే అధికారులు, ఉద్యోగుల కోసం.. ఎస్ఆర్ఎం, విట్ యూనివర్సిటీలు సీబీఎస్ఈ స్కూల్స్, ఆసుపత్రులు వచ్చే మార్చి నాటికి ఏర్పాటు చేస్తున్నాయి. భవనాలు పూర్తయ్యే నాటికి అన్ని వసతులు కల్పిస్తాం. రైతుల రిటర్నబుల్ ఫ్లాట్లలో మౌలిక వసతుల కల్పన వర్షాలు తగ్గిన వెంటనే ప్రారంభిస్తాం. గత ప్రభుత్వం సింగపూర్ అధికారులపై కేసులు పెట్టి వేధించింది. వాళ్లకు ఒక నగరాన్ని ఎలా నిర్మించాలో అవగాహన లేదు. వారి నిర్వాకంతో ఏపీ, సింగపూర్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. సింగపూర్ పర్యటనలో అక్కడి ప్రభుత్వానికి ఏపీపై ఉన్న ముద్ర పోయేలా చర్చిస్తాం" అని నారాయణ తెలిపారు.

## అదే జరిగితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్చరిక

హైదరాబాద్: జీవో నెంబర్ 49ని తిరిగి తీసుకువస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా జిన్నారం మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అటవీ శాఖ అధికారులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో రాకపోకలు నిలిపివేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. తరిమి తరిమి కొడతామని అధికారులను హెచ్చరించారు. పోడు రైతులు, అటవీ బిడ్డలపై ఆంక్షలు పెడితే సహించేది లేదని అన్నారు. పద్ధతి మార్చుకోవాలని ఇప్పటికే పలుమార్లు అటవీ శాఖ అధికారులను హెచ్చరించామని ఆయన అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలకు రేషన్ కార్డులను ఇస్తోందని ఆయన అన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక విషయంలో ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు.

## 24 గంటలు, 365 రోజులు భారత్ అప్రమత్తంగా ఉండాలి సీడీఎస్ అనిల్ చౌహాన్

ఢిల్లీ: భారతదేశం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, పాకిస్థాన్ ఎటువంటి దుస్సాహసానికి ఒడిగట్టినా మన దళాలు 365 రోజులు, 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగిన డిఫెన్స్ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ, సాంకేతికత అభివృద్ధి చెందిందని, సైన్యం కూడా ఎప్పటికప్పుడు వ్యూహాత్మకత, కార్యాచరణ, నైపుణ్యాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆయుధాలు, ఇతర పరిజ్ఞానం గురించి సైన్యం పూర్తిగా అప్‌డేట్ అయి ఉండాలని సూచించారు. యుద్ధాల గతి మారిపోతోందని సీడీఎస్ వెల్లడించారు. భవిష్యత్తులో దళాల్లో ఇన్ఫో–టెక్‌తో పాటు స్కాలర్ వారియర్స్ కలగలిసి ఉంటారని అనిల్ చౌహాన్ అన్నారు. ఏం జరగబోతున్నా మనం ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని ఆయన ఉద్ఘాటించారు.

## బంగ్లాదేశ్‌లోనూ తాలిబన్ రాజ్యం.. మహిళల దుస్తులపై ఆంక్షలు

బంగ్లాదేశ్: నోబెల్ గ్రహీత ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం తీవ్ర వివాదంలో చిక్కుకుంది. మహిళల దుస్తులపై ఆంక్షలు విధించడం, ప్రభుత్వ ఉద్యోగుల నిరసనలను నిషేధిస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్‌లే ఇందుకు కారణం. ఈ పరిణామాలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శకు దారితీశాయి. కొందరు దీనిని ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబాన్ పాలనతో పోల్చారు. ఈ వారం ప్రారంభంలో బంగ్లాదేశ్ బ్యాంక్ (సెంట్రల్ బ్యాంక్) తన మహిళా ఉద్యోగులు పొట్టి దుస్తులు, స్లీవ్ లెస్ దుస్తులు, లెగ్గింగ్స్ ధరించకుండా నిషేధించింది. శరీరమంతా కప్పే సంప్రదాయ దుస్తులైన చీరలు, లేదా సల్వార్ కమీజ్‌లను ధరించాలని ఆదేశించింది. అదనంగా, మహిళలు హెడ్‌స్కార్ఫ్ లేదా హిజాబ్ ధరించాలని, ఫార్మల్ షూస్ లేదా శాండల్స్ ఉపయోగించాలని సూచించింది. పురుష ఉద్యోగులు జీన్స్, చినో ట్రౌజర్స్ ధరించడంపై నిషేధం విధించారు. ఈ ఆదేశాలను పాటించని వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్ఆర్ విభాగం హెచ్చరించింది. ఈ ఆంక్షలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. పౌరులు, జర్నలిస్టులు సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని 'డిక్టేటర్‌షిప్' అని ఆరోపించారు. కొందరు ఈ ఆదేశాలను ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు జారీ చేసిన శాసనాలతో పోల్చారు. 'ముహమ్మద్ యూనస్ పాలనలో కొత్త తాలిబానీ యుగం' అని ఒక యూజర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సోషల్ మీడియాలో ఉద్ధృతమైన విమర్శల నేపథ్యంలో బంగ్లాదేశ్ బ్యాంక్ గురువారం ఈ ఆదేశాన్ని ఉపసంహరించుకుంది.

## తెలంగాణ వద్ద ఉన్నంత డేటా మరో రాష్ట్రంలో లేదు

ఢిల్లీ: భారతదేశంలో తెలంగాణ రాష్ట్రానికి ఉన్న స్థాయిలో సమగ్రమైన డేటా మరే ఇతర రాష్ట్రానికీ లేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దేశంలో కులగణన నిర్వహణకు ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కులగణనపై ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ప్రజెంటేషన్‌కు రాహుల్ గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అంచనాలకు మించి రాణించారని ప్రశంసించారు. కులగణన నిర్వహణ అంత సులభం కాదని ఆయన అన్నారు. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఈ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిందని వ్యాఖ్యానించారు. కార్యాలయాలలో కూర్చొని కులగణన చేస్తే సరైన ఫలితాలు రావని ఆయన అన్నారు. తెలంగాణ కులగణనలో దాదాపు 56 ప్రశ్నలు అడిగారని గుర్తు చేశారు. సరైన డేటా ఉంటే ఏదైనా సాధించగలమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ చేతిలో ఇప్పుడు సరైన డేటా ఉందని రాహుల్ గాంధీ అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సరైన రీతిలో కులగణన చేయదని ఆయన విమర్శించారు. దేశ వాస్తవ చిత్రాన్ని బహిర్గతం చేయడానికి ఆ పార్టీ ఇష్టపడదని వ్యాఖ్యానించారు. సమాజాన్ని వేగంగా అభివృద్ధి చేసే శక్తి విద్యకు మాత్రమే ఉందని ఆయన అన్నారు. హిందీ, ఇతర ప్రాంతీయ భాషలు ముఖ్యం కాదని తాను చెప్పడం లేదని, కానీ ఆంగ్లం కూడా ముఖ్యమేనని ఆయన అన్నారు. బీజేపీ నేతల పిల్లలు ఏ భాషలో చదువుతున్నారని ఆయన ప్రశ్నించారు.

## తెలంగాణ క్యాబినెట్ భేటీ వాయిదా

హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్ సమావేశం వాయిదా పడింది. శుక్రవారం సచివాలయంలో జరగాల్సిన క్యాబినెట్ భేటీని సోమవారానికి వాయిదా వేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగాల్సి ఉంది. అయితే, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో ఉన్నారు. అదేవిధంగా, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న ఏఐసీసీ సమావేశంలో పాల్గొంటున్న నేపథ్యంలో మంత్రివర్గ సమావేశం వాయిదా వేసినట్లు తెలుస్తోంది. క్యాబినెట్ భేటీని సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు అధికారవర్గాల సమాచారం.

## ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ఉధృతి..

ధవళేశ్వరం: తెలుగు రాష్ట్రాలతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద ఉధృతి పెరగడంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 175 గేట్లను ఎత్తి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 2,16,300 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసినట్లు తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా మిగతా చోట్ల కూడా ముసురు వాతావరణం నెలకొంది. రెండు రాష్ట్రాల్లోని వాగులు, వంకలు, నదులకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. తూర్పు గోదావరి జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాల కారణంగా లంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. రాబోయే మూడ్రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

## రాజ్యసభ ఎంపీగా కమల్ హాసన్ ప్రమాణస్వీకారం

ఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా ఐదోరోజు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభలు సమావేశమయ్యాయి. సభ ప్రారంభం కాగానే ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ అధినేత కమల్ హాసన్ ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. తమిళంలో ఆయన ప్రమాణం చేశారు. కాగా, జూన్‌లో డీఎంకే కూటమి మద్దతుతో కమల్ రాజ్యసభ ఎంపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయనతో పాటు డీఎంకే నుంచి పి. విల్సన్, సల్మా, ఎస్.ఆర్. శివలింగం కూడా ఎంపీలుగా ఎన్నికయ్యారు. వారు కూడా తాజాగా ప్రమాణస్వీకారం చేశారు. ఇక, 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించిన కమల్ హాసన్... 2021 తమిళనాడులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమికి మద్దతు ప్రకటిస్తూ.. డీఎంకేకు తమ పార్టీ మద్దతును ప్రకటించారు. ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. డీఎంకే పార్టీ తమిళనాడులో తమ పార్టీ జెండా ఎగురవేసింది. ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో డీఎంకేకు 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో నాలుగు రాజ్యసభ స్థానాలనూ ఆ పార్టీనే దక్కించుకుంది. పొత్తులో భాగంగా 2025 రాజ్యసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. ఈ నేపథ్యంలో కమల్ హాసన్ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## కర్నూలు జిల్లాలో డ్రోన్ నుంచి క్షిపణి పరీక్ష.. ట్వీట్ చేసిన రాజ్‌నాథ్ సింగ్

కర్నూలు: డ్రోన్ నుండి క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా పరీక్షించినట్లు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ పరీక్ష ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో గల నేషనల్ ఓపెన్ ఏరియా రేంజి (ఎన్ఓఏఆర్)లో జరిగింది. ఈ ప్రయోగానికి సంబంధించిన ఫొటోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. డీఆర్డీఓ, ఈ క్షిపణి అభివృద్ధి మరియు తయారీలో భాగస్వాములైన ఎంఎస్ఎంఈలు, స్టార్టప్స్‌లను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. సంక్లిష్టమైన సాంకేతికతను అర్థం చేసుకోవడంతో పాటు ఉత్పత్తి చేయగల సామర్థ్యం భారతదేశానికి ఉందని ఈ పరీక్ష నిరూపించిందని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణిని యూఏవీ లాంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మిసైల్ (యూఎల్‌పీజీఎం)–వీ3గా వ్యవహరిస్తున్నారు. అయితే, దీని సాంకేతిక వివరాలను వెల్లడించలేదు. గతంలో డీఆర్డీవో పత్రాలు, బహిరంగ సమాచారం ప్రకారం గతంలో పరీక్షించిన యూఎల్‌పీజీఎం–వీ2 వేదికపైనే దీనిని అభివృద్ధి చేశారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలను సమీపంలోని డీఆర్డీవోకు చెందిన ఎన్ఓఏఆర్ పరీక్ష కేంద్రాన్ని దీని కోసం ఎంచుకున్నారు. గతంలో కూడా ఇక్కడ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ వ్యవస్థను పరీక్షించేందుకు ఇదే వేదికను ఉపయోగించారు. ఈ ఆయుధం ఫిక్స్‌డ్‌వింగ్ మానవరహిత విమానాలను కూల్చివేయడానికి ఉపయోగిస్తారు.

## మోదీ విదేశీ పర్యటనలు.. మూడేళ్లలో రూ.295 కోట్ల ఖర్చు

ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు సంబంధించి గత మూడేళ్లలో రూ.295 కోట్లు ఖర్చయిందని కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. ఈ మేరకు గురువారం రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఇందులో మోదీ పర్యటనలకు సంబంధించి ఏ దేశానికి వెళ్లినపుడు ఎంత ఖర్చయిందనే వివరాలను ఆయన వెల్లడించారు. 2021 నుంచి 2024 మధ్య కాలంలో ప్రధాని మోదీ విదేశీ పర్యటనల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి దాదాపు రూ.295 కోట్లు దాదాపు రూ.295 కోట్లు వెచ్చించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో ఒక్క ఫ్రాన్స్ పర్యటన (2025) కే రూ.25 కోట్లు ఖర్చయిందని వివరించారు. 2023 జూన్ లో మోదీ అమెరికా పర్యటనకు రూ.22 కోట్లు ఖర్చయిందన్నారు. ఇటీవల మోదీ ఐదు దేశాలలో పర్యటించగా దీనికోసం రూ.67 కోట్లు ఖర్చయిందని తెలిపారు. ఈ ఏడాదిలో మోదీ మారిషస్, సైప్రస్, కెనడా, క్రొయేషియా, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాలలో పర్యటించారు. అయితే, ఈ దేశాలకు సంబంధించిన ఖర్చులను మాత్రం మంత్రి వెల్లడించలేదు.

# 9 సంవత్సరాల బాలుడికి రక్తదానం చేసిన రైల్వే ఉద్యోగి విగ్నేష్



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూలై 26 (శుభోదయం న్యూస్) : డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న 9 సంవత్సరాల బాలునికి రైల్వే ఉద్యోగి విగ్నేష్ రక్తదానం చేశారు ఈ సంఘటన శుక్రవారం జరిగింది లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు రంజాన్ కథనం మేరకు పట్టణంలోని పిఎస్ ఆసుపత్రిలో 9 సంవత్సరాల బాలుడు డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్నాడు ఈ నేపథ్యంలో అతనికి బి పాజిటివ్ రక్తం అవసరం కాక రక్తదాత రైల్వే ఉద్యోగి విగ్నేష్ కు రంజాన్ సమాచారం అందించారు దీంతో ఆయన గోపి బ్లడ్ బ్యాంక్ వచ్చి రక్తదానం చేశారు సందర్భంగా రంజాన్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఐలా పరిధిలో మౌలిక వసతుల కల్పనకు సంపూర్ణ సహకారం

## ఎమ్మెల్యే జిఎంఆర్ఐల ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటన

పటాన్చెరు, (శుభోదయం న్యూస్): పటాన్చెరు డివిజన్ పరిధిలోని పారిశ్రామికవాడలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తామని పటాన్చెరు శాసనసభ్యులు మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు ఐలా ప్రతినిధులు ఇటీవల తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులు, ఐలా ప్రతినిధులతో కలిసి పటాన్చెరు పట్టణ పరిధిలోని ఐలా పారిశ్రామికవాడలో పర్యటించారు. ప్రధానంగా పరిశ్రమలకు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో ఈదురు గాలుల మూలంగా విద్యుత్ లైన్లు తెగిపోవడం మూలంగా విద్యుత్ సరఫరాకు ఆటంకాలు ఎదురవుతున్నాయని.. నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితో పాటు పారిశ్రామిక వాడలో నూతన రహదారుల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పారిశ్రామికవాడలో నూతన విద్యుత్ లైన్లతో పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అనుగుణంగా లైన్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్కో డిఈ భాస్కర్ రావు ను ఆదేశించారు. అతి త్వరలో హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి పరిశ్రమకు మంచినీటి కనెక్షన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. పరిశ్రమలలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని పారిశ్రామిక వేత్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐలా చైర్మన్ సుధీర్ రెడ్డి, విద్యుత్ శాఖ డీఈ భాస్కర రావు, ఐలా ప్రతినిధులు రంజిత్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# చిదృప్ప గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా అధికార పార్టీ నాయకులు బిజెపి నాయకుల పై దాడి



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా కంది మండలం చిధ్రుప్ప గ్రామంలో బోనాల పండగ సందర్భంగా అధికార పార్టీ నాయకులు బీజేపీ నాయకులపై దాడి జరిగింది. ఈ నేపథ్యంలో బీజేపీ సీనియర్ నాయకులు నాయకోటి రాములు, ఇతర కార్యకర్తలను ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి, బీజేపీ నాయకులతో కలిసి పరామర్శించారు. కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా



కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాజేశ్వర్ దేశ్ పండే, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నర్సింహా రెడ్డి, పోచారం రాములు, జిల్లా అధికార ప్రతినిధి రాజు గౌడ్,కంది మండలం అధ్యక్షులు గిరి, యువ మోర్చా అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా సిఎంఆర్ఎఫ్

## 2 లక్షల రూపాయల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండలం భానూరు గ్రామానికి చెందిన సురేష్ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంలో బాధపడుతున్నారు. స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రెండు లక్షల రూపాయల ఎల్ఓసి మంజూరు అయింది. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సురేష్ కుటుంబ సభ్యులకు ఎల్ఓసి అనుమతి పత్రాలను ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, పాండు, కాశి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మాదారం గ్రామంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు మొక్కలు నాటిన బిఆర్ఎస్ నాయకులు





జిన్నారం, (శుభోదయం న్యూస్): బి ఆర్ స్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ మాజీ మంత్రి కేటీర్ జన్మదినం సందర్భంగా జిన్నారం మండలం మాదారం గ్రామంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంనికి ముఖ్య అతిది గా రాష్ట్ర నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, సురేందర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు రాజేష్, శివరాజ్, ఆంజనేయులు, నరేందర్, జనార్ధన్, ప్రభాకర్ రెడ్డి, భార్గవ్, సత్యనారాయణ, రవీందర్ సార్,మోహన్, గణేష్, రామకృష్ణ, ఆంజనేయులు, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్,రాజు,సతీష్, ఆంజనేయులు,కదీర్,బిక్షపతి, శ్రీనివాస్, రమేష్,నర్సింగ్ రావు, విష్ణు, మల్లేష్, మహేందర్, రాజు గౌడ్, భవాని సింగ్, శ్రీను, నిఖిల్, గణేష్ ,బాలేష్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని

# కేటీఆర్ జన్మదిన వేడుకలు



గుమ్మడిదల, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సిజిఆర్ కార్యాలయంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ నాయకత్వం రాష్ట్రానికి విశేషమైన ప్రగతిని తీసుకువచ్చిందని ప్రశంసించారు. గ్రామీణాభివృద్ధి, యువత ఆకాంక్షలకు న్యాయం చేయడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. కేటీఆర్ లాంటి ప్రజానేత జన్మదినాన్ని జరపడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, దోమడు గుశంకర్, శ్రీనివాస్, నాయకులు దేవేందర్ రెడ్డి, మొగులయ్య, మంద భాస్కర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, వినోద్, గోపాల్, రమేష్, చంద్రశేఖర్, సంజీవరెడ్డి, ఆంజనేయులు యాదవ్, యాదిరెడ్డి, గోపాల్, మహేష్, ప్రవీణ్ రెడ్డి, మల్లేష్, పద్మారెడ్డి, కర్ణాకర్ రెడ్డి, భార్గవ్ చారి,పలువురు మాజీప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, పాల్గొన్నారు.

# మామునూరు ఎయిర్ పోర్టుకి నిధులిచ్చినందుకు సీఎం రేవంతన్నకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కొండా సురేఖ



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్ ): ఇది వరంగల్ ప్రాంత దిశను మార్చేసే ప్రాజెక్టు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ స్పష్టీకరణ హైదరాబాద్ వరంగల్ ప్రాంత దిశదశను మార్చేసే మామునూరు ఎయిర్పోర్టు నిర్మాణ పనులకి అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయగా... అందుకు కృషి చేసిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకి.రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. రూ.205 కోట్ల నిధులు విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి భూములిస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.కోటి 20 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించినట్టు వివరించారు. అలాగే ప్లాట్లకు, ఇళ్లకు సైతం న్యాయమైన పరిహారం చెల్లించేందుకు ప్రతిపాదించారు. గత నెల రోజులుగా భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో తాము జిల్లా ఇంఛార్జీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జిల్లాకి చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కృషి.

## నూతన ఎస్పీ పదవి బాధ్యతలు చేపట్టిన పాటిల్ కాంతిలాల్ సుభాష్ నీ సన్మానించిన కోట్నక విజయ్ కుమార్



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా (శుభోదయం న్యూస్)నూతన ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి, తుడుందేబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కోట్నక విజయ్ కుమార్ ఆదివాసీ సమస్యల పట్ల చక్కటి అవగాహన ఉన్న మీరు ఆదివాసుల సమస్యల పై పరిష్కరిస్తూ సహకరించాలని కోరారు. నీతి నిజాయితీ యంగ్ డైనమిక్ ఆఫీసర్ గ బాధ్యతలు స్వీకరించినందుకు మాకు చాలా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ వాంకిడి మండల అధ్యక్షుడు మడవి భీమ్రావు, కార్యదర్శి జుగునాక అంబారావు, ధ్రువ భాను ప్రకాష్, కుదిరిపాక కమలాకర్, ఎస్.కె ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలను గోదాములపై ఆకస్మికంగా ప్రత్యేక తనిఖీలు




మంచిర్యాల జిల్లా (శుభోదయం న్యూస్)తాండూర్ మండలంలోజిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సంయుక్త తనిఖీలలో భాగంగా హనుమాన్ ఫెర్టిలైజర్, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం కాసిపేట, ఇతర ఫెర్టిలైజర్ దుకాణాలను మండల తహసిల్దార్ జ్యోత్స్న, మాదారం ఎస్సై సౌజన్య, వ్యవసాయ అధికారి కే సుష్మా ఎరువుల దుకాణాలను, గోదాములను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది ఇందులో భాగంగా తహసిల్దార్ మేడం, వ్యవసాయ అధికారి ఎరువుల డీలర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా డీలర్లు ఎరువులను అధిక ధరలకు అమ్మిన అలాగే రైతులకు ఇతర ఎరువులకు లింకు చేసి అమ్మిన తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది . ప్రతి ఎరువు దుకాణం ముందు స్టాకు నిలువలు మరియు ధరల పట్టిక రైతులకు కనబడేలా తప్పనిసరిగా ప్రదర్శించమని చెప్పడం జరిగింది. వానాకాలం సీజన్ కు గాను రైతులకు కావలసినవి అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించడం జరిగింది. యూరియాను వ్యవసాయ సాగు కొరకు మాత్రమే అమ్మాలని హెచ్చరించిన మండల వ్యవసాయ అధికారిని కె.సుష్మా

# విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలిజిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా (శుభోదయం న్యూస్) రెబ్బెన మండలం ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం



జిల్లాలోని రెబ్బెన మండలం వంకులం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి తరగతి గది, వంటశాల, ఆహారం నాణ్యత, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో మధ్యాహ్నం భోజనం అందించాలని, ఆహారం తయారు చేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. బడి వయసు గల పిల్లలు ఎవరు బడి బయట ఉండకూడదని, బడి వయసు పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలు చేర్పించాలని తెలిపారు. విద్యార్థుల పఠన సామర్థ్యం, ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తరగతి గదిలో విద్యార్థులను సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి పఠన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మండలంలోని కైర్ గాం గ్రామంలో గల పల్లె దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేసి మందుల గది, వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. గ్రామంలో జ్వర పీడితులను గుర్తించి వారికి వెంటనే వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా నెలలు నిండిన గర్భిణులను సుఖ ప్రసవం కొరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాలలో ఆశ కార్యకర్తలతో కలిసి పర్యటించి ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, తహసిల్దార్ సూర్యప్రకాష్, మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# డెంగ్యూలాంటి జ్వరాలకు ప్రభుత్వపరంగా అన్ని రకాల పరీక్షలు ఉన్నాయి భయాందోళనకు పడవద్దు జిల్లా డాక్టర్ హరీష్ రాజ్




మంచిర్యాల జిల్లా (శుభోదయం న్యూస్) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ డ్రైడేలో భాగంగా ఈరోజు నస్పూర్ గ్రామంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలలో వైద్యులు వైద్య సిబ్బంది ఫ్రైడే కార్యక్రమాలు వారంలో రెండు రోజులపాటు మంగళవారము శుక్రవారం నిర్మించాలని ఆదేశించినారు దీనివలన దోమల ఆరువాలు పెరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది దోమలు గుడ్లు పెట్టకుండా పెరగకుండా కుట్టకుండా చూసుకోవాలని ఈ దోమల ద్వారా కీటకజనిత వ్యాధులైన మలేరియా డెంగ్యూ చికెన్ గునియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్త పడాలని ముఖ్యంగా ఈ కార్యక్రమంలో మునిసిపల్ గ్రామపంచాయతీ సిబ్బందిని మరియు సంఘాలను గ్రామస్తులను స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించినారు అదేవిధంగా దోమలు పెరగకుండా పుట్టకుండా చూసుకోవాలని దోమతెరలు వాడాలని ప్రతి ఇంటి చుట్టూ నీరు నిలువ లేకుండా చేసుకోవాలని ఆదేశించినారు ఇంట్లో వాళ్ళందరూ సెలవు రోజున మన ఇంటి చుట్టుపక్కల ఉన్న ఇంటిలో ఉన్న నీటి నిలువలను తీసివేయాలని దీని ద్వారా దోమలను నిర్మూలించవచ్చని అదేవిధంగా కూలర్ లలో చాలా గ్రామాలలో నీరు ఉంచుకుంటున్నారు దీనివల్ల దోమలు పెరుగుతాయి కావున ప్రజలందరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకొనడానికి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించినారు డెంగ్యూ లాంటి జ్వరాలపైన భయపడే అవసరం లేదని ప్రభుత్వపరంగా అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ఎలాంటి భయాందోళనకు గురి కావద్దని అన్నారు ప్రైవేట్ ఆస్పత్రులు గాని ఇంకా ఇతరులు కానీ డెంగ్యూ పైన భయపెట్టినచో తగిన చర్యలు తీసుకున్న బడును మరియు ప్రభుత్వంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు అందుబాటులో ఉన్నవని తెలియజేసినారు ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ అనిత ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేష్ ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు బుక్కం వెంకటేశ్వర్ జిల్లా మాస్ మీడియా అధికారి పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీలోకి పలువురి చేరికలు



మంచిర్యాల జిల్లా (శుభోదయం న్యూస్) వేమనపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ వేమనపల్లి మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో ముల్కలపేట గ్రామానికి చెందిన ఒడిలా మొగిలి, కొత్తూరి పురుషోత్తం బీజేపీ పార్టీలో చేరారు, వీరికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకట కృష్ణ పార్టీ కండువా కప్పి పార్టీ లోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు ఎనముల వెంకటేష్, కొప్పుల చరణ్ రాజ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మడే శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షులు ముల్కల సత్యనారాయణ, నౌనూరి రమేష్ గౌడ్, బిజేవైఎం అధ్యక్షులు కంపెల అజయ్ కుమార్, జుమ్మిడే వెంకటేష్, బీజేపీ నాయకులు సీపెల్లి కిషోర్, కోయిల స్వామి, కుబిడే అంజన్న, గొండే రాజన్న, కొత్తూరి పోచయ్య మడే రాహుల్, మడే సమ్మయ్య, ఎల్కరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీకి అంత సీను లేదు, మీడియా అతిగా చూపించింది..




**న్యూఢిల్లీ,:** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ భగీదారీ బాయి సమ్మేళన్‌లో మాట్లాడుతూ..ప్రధాని మోడీకి చేసేదంతా "షో"నే అని, ఆయకు సరైన విషయం లేదని అన్నారు. ఆయన ఒక పెద్ద ప్రదర్శన, ఆయనకు చాలా ప్రాముఖ్యత ఇచ్చారని కామెంట్స్ చేశారు. ప్రధాని మోడీని రెండు మూడు సార్లు కలిసిన తర్వాత, ఆయనతో ఒకే గదిలో కూర్చున్న తర్వాత, ప్రధాని మోడీ ఎప్పుడూ "పెద్ద సమస్య" కాదని తాను భావించానని, ఆయనకు దమ్ము లేదని రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని మోడీ వేవ్ లేదని, మీడియా ఆయన అంచనాలను అతి చేసి చూపించిందని ఆరోపించారు. భారతదేశంలో అధికార వ్యవస్థలో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం తక్కువగా ఉందని కాంగ్రెస్ ఎంపీ అన్నారు. దళితులు, వెనకబడిన తరగతులు, గిరిజనులు, మైనారిటీలు దేశ జనాభాలో 90 శాతం ఉన్నారు, కానీ బడ్జెట్ రూపొందించిన తర్వాత హల్వా పంపిణీ చేస్తున్నప్పుడు, ఈ 90 శాతం మందికి ప్రాతినిధ్యం వహించే వారు ఎవరూ లేరని అన్నారు. 2004లో యూపీఏ-1 అధికారంలోకి వచ్చిన తర్వాత, తాను ఓబీసీలను అప్పుడే కలిసి ఉండాల్సిందని విచారం వ్యక్తం చేశారు. మీ చరిత్ర గురించి, సమస్యల గురించి అప్పుడే నాకు తెలిసి ఉంటే కుల గణన నిర్వహించే వాడినని అన్నారు. తాము చేసిన తప్పును సరిదిద్దుకుంటామని అన్నారు.

## జమ్మూ కాశ్మీర్‌లో పేలిన ల్యాండ్‌మైన్.. ఆర్మీ జవాను మృతి



**న్యూఢిల్లీ,:** జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్‌లోని నియంత్రణ రేఖ సమీపంలో ల్యాండ్‌మైన్ పేలింది. ఈ ప్రమాదంలో భారత సైన్యంలోని జాట్ రెజిమెంట్‌కు చెందిన ఒక సైనికుడు (అగ్నివీర్) మరణించగా, ఒక జెసిఓ, ఒక సైనికుడు గాయపడ్డారు. గాయపడిన సైనికులను హెలికాప్టర్ ద్వారా ఉధంపూర్‌లోని ఆర్మీ బేస్ ఆసుపత్రికి తరలించారు. హావేలి తహసీల్‌లోని సలోత్రి గ్రామంలోని విక్టర్ పోస్ట్ సమీపంలో మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, ఈ ల్యాండ్‌మైన్‌లను ఈ ప్రాంతంలో చొరబాట్లను నిరోధించడానికి అమర్చారు. భారత సైన్యంలోని 07 జాట్ రెజిమెంట్ సైనికులు సాధారణ గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పేలినట్లు తెలుస్తోంది.

## చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై 420 కేసు పెట్టాలి..


### మాజీ మంత్రి డిమాండ్..




**అమరావతి,:** సంతకం పెట్టి హామీలు అమలు చేయాని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై 420 కేసు పెట్టాలని డిమాండ్ చేశారు మాజీ మంత్రి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆర్కే రోజా.. తిరుపతి జిల్లా నింద్ర మండలంలో రికాలింగ్ చంద్రబాబు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ఇచ్చిన హామీలు అన్ని అమలు చేశానంటూ చంద్రబాబు సిగ్గు లేకుండా అబద్దాలు చెబుతున్నారంటూ మండిపడ్డారు.. అబద్దాలు చెప్పి అధికారంలోకి రావడం చంద్రబాబుకు అలవాటని వ్యాఖ్యానించిన ఆమె.. సంతకం పెట్టి హామీలు అమలు చేయాని చంద్రబాబు, పవన్ పై 420 కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.. నిరుద్యోగులను, పిల్లలు సహా అందరినీ ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు ఆర్కే రోజా.. సిగ్గు లేకుండా అడ్డదిడ్డంగా పెరిగిన అచ్చెన్నాయుడు.. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే ఏపీ అమ్మేయాలని అంటున్నాడు అని మండిపడ్డారు.. ప్రతి నెల 1500 రూపాయలు మహిళలకు ఇస్తామని చెప్పి మోసం చేశారు రెండు కోట్ల మందికి ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా మోసం చేస్తున్నాడు.. హామీ ఇచ్చేటప్పుడు మీకు తెలియదా..? అని నిలదీశారు.. కేవలం అధికారం కోసమే హామీలు ఇచ్చారని దుయ్యబట్టారు.. ఇలాంటి వారికి ఓటు వేసినందుకు ప్రజలు సిగ్గుపడాలి కానీ, మనం సిగ్గుపడాల్సిన అవసరం లేదన్నారు రోజా.. ఇక, రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఫ్రీ బస్సు అంటూ మోసం చేశారని మండిపడ్డారు. మరోవైపు, శ్రీశైలం మాజీ బోర్డు చైర్మన్ చక్రపాణి రెడ్డి పెద్ద వెన్నుపోటుదారుడు అని ఫైర్ అయ్యారు రోజా.. నింద్ర మండలంలో ఒక్క అభివృద్ధి పని చేయలేదు సొంత చిన్నాన్న మాజీ మంత్రి చెంగారెడ్డికి వెన్నుపోటు పొడిచాడు, తరువాత నా దగ్గర పదవులు, లబ్ధిపొంది నాకు వెన్నుపోటు పొడిచాడు.. కానీ, ఇప్పుడు గాలి భాను ప్రకాష్ వెన్నుపోటు పోడవకుండా ఉంటారా? అని ప్రశ్నించారు.. నా వల్ల లబ్ధిపొంది నాకే వెన్నుపోటు పొడిచి ఇప్పుడు వెన్నుపోటు పార్టీలో చేరారంటూ సెటైర్లు వేశారు మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా..

## రేవంత్ రెడ్డికి ఆస్కార్ అవార్డు కాదు

## భాస్కర్ అవార్డు ఇవ్వాలి..!



**హైదరాబాద్, :** మీడియాతో చిట్ చాట్ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి ఆస్కార్ అవార్డు కాదు, భాస్కర్ అవార్డు ఇవ్వాలి.. నోబెల్ ప్రైజ్ కాదు, గోబెల్స్ ప్రైజ్ ఇవ్వాలి అంటూ సెటైర్లు వేశారు. నరేంద్ర మోడీ సీఎం అయ్యే ముందు నుంచే బీసీ.. అప్పటి నుంచి ఎన్నో కులాలు బీసీల్లో కలిసిపోయినట్లు గుర్తు చేశారు. ఇక, రాహుల్ గాంధీ తల్లి తండ్రులు వేర్వేరు మతాలకు చెందినవారు, ఆయన కులం ఏంటి?" అని ప్రశ్నించారు. అయితే, పార్టీలో పోస్టుల కోసం ఒత్తిడి చేయొద్దు అన్నారు. మనం అందరం పార్టీ కార్యకర్తలమే, పదవులు వచ్చినవారు ఎక్కువ కాదు, రాని వారు తక్కువ కాదని వెల్లడించారు. వారం రోజుల్లో పార్టీ కొత్త కమిటీని ప్రకటిస్తుంది.. అందులో మొత్తం 20 మందిని నియమిస్తాం.. 33 శాతం మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని రామచందర్ రావు చెప్పుకొచ్చారు. ఇక, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇచ్చిన సూచనల మేరకు పార్టీ నేతలు ఎక్కువ టూర్లు చేయాలని, కార్యకర్తల్ని కలవాలని రామచందర్ రావు పేర్కొన్నారు. పార్టీ అంతర్గత సమస్యలు కుటుంబ సమస్యల వంటివే, వాటిని బయటకు తీసుకురావద్దు అన్నారు. అలాగే, దత్తాత్రేయని వైస్ ప్రెసిడెంట్ చేయమన్నట్టే, మేము కూడా పొన్నం ప్రభాకర్‌ను లేదా మహేష్ గౌడ్‌ను సీఎం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.. బీజేపీ బీసీ పక్షపాతి.. బీసీలను పార్టీకి దూరం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు.. మేము 42 శాతం రిజర్వేషన్‌కు సపోర్టు ఇస్తున్నాం.. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కేంద్రంపై నెట్టవద్దని, రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని వెల్లడించారు. బీజేపీలో ఉన్న రెడ్డి నేతలెవరూ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా లేరని, పార్టీ లీడర్ మహేశ్వర్ రెడ్డి కూడా ఈ విషయాన్ని తెలియజేశారని రామచందర్ రావు చెప్పారు.

# స్వేచ్ఛావాణిజ్యం కల సాకారం



దాదాపు నాలుగేళ్ల కాలం... పదహారు దఫాల చర్చలు... నలుగురు ప్రధానులు-ఎట్టకేలకు బ్రిటన్ అభీష్టం నెరవేరింది. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌ల సమక్షంలో రెండు దేశాల వాణిజ్య మంత్రులు పీయూష్ గోయెల్, జొనాథన్ రేనాల్డ్స్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై లండన్‌లో సంతకాలు చేశారు. ఈ ద్వైపాక్షిక ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంటు ధ్రువీకరించాల్సి వుంది. ఆ ప్రక్రియకు ఏడాది సమయం పడుతుందంటున్నారు. 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్య పరిమాణం 12,000 కోట్ల డాలర్లకు చేరుకోవాలన్నది ఎఫ్‌టీఏ లక్ష్యం. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతున్న భారత్‌తో ఎఫ్‌టీఏ సాకారం కావాలని ఆ దేశం ఎంతగానో ఎదురుచూసింది. అందుకు కారణముంది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బయటికొచ్చాక సాగిస్తున్న ఒంటరి ప్రయాణం దాని ఆర్థిక వ్యవస్థను ఒడిదుడుకుల్లో పడేసింది. ఒకప్పుడు ప్రపంచంలో రవి అస్తమించని సామ్రాజ్యాన్నేలిన దేశం నేల చూపులు చూడటం మొదలైంది. అందుకే కన్సర్వేటివ్ పార్టీకి చెందిన బోరిస్ జాన్సన్ ప్రధానిగా వున్నప్పుడు 2022లో తొలిసారి ఎఫ్‌టీఏ కుదుర్చుకోవాలన్న ప్రతిపాదన వచ్చింది. ఆయన స్థానంలో అదే పార్టీకి చెందిన లిజ్ ట్రస్ వచ్చారు. ఆమె 49 రోజుల్లోనే పదవి పోగొట్టుకున్నారు. తదనంతరం భారత్ మూలాలున్న రిషి సునాక్ ప్రధాని అయ్యారు. ఆయన కూడా నిష్క్రమించి ఎన్నికల్లో లేబర్ పార్టీ విజయం సాధించి ప్రస్తుత ప్రధాని స్టార్మర్ బాధ్యతలు స్వీకరించారు. వీరిలో అందరూ భారత్‌తో ఎఫ్‌టీఏ కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినవారే. మొన్నటి ఎన్నికల్లో లేబర్ పార్టీ ప్రధాన వాగ్దానాల్లో భారత్‌తో ఎఫ్‌టీఏ కుదుర్చుకుంటామన్నది ఒకటి. మొత్తానికి అనేక రకాల అడ్డంకులూ, అపోహలూ అధిగమించి ఒప్పందం సాకారమైంది. ఎఫ్‌టీఏ వల్ల బ్రిటన్‌లో ఏటా కొత్తగా 2,200 ఉద్యోగాలొస్తాయని, దేశ జీడీపీ 480 కోట్ల పౌండ్ల (రూ. 56,150 కోట్లు) మేర పెరుగుతుందని అంచనా. అయితే రెండు దేశాల్లోనూ ఎఫ్‌టీఏపై అసంతృప్తి తక్కువేమీ లేదు. ఈ ఒప్పందం వల్ల ప్రధానంగా లాభపడేది స్కాచ్ విస్కీ, జిన్ ఉత్పత్తిదార్లు, బ్రిటన్ కార్ల పరిశ్రమలు. జిన్, స్కాచ్ విస్కీలపై ప్రస్తుతం 150 శాతం దిగుమతి సుంకాలుండగా, అవి 75 శాతానికి పడిపోతాయి. వచ్చే పదేళ్ల కాలంలో 40 శాతానికొస్తాయి. అలాగే బ్రిటన్ కార్లపై ప్రస్తుతం 100 శాతం సుంకాలున్నాయి. అవి పది శాతానికి పడిపోతాయి. ఎగువ మధ్య తరగతి, సంపన్న వర్గాలకు ఇది ఊరటనిచ్చే కబురు. మన ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లకు కూడా గిరాకీ ఏర్పడుతుంది. ఈ రంగంలో టాటాలకు డబుల్ ధమాకా అని చెప్పాలి. బ్రిటన్‌లో ఆ సంస్థ ఉత్పత్తి చేసే జాగ్వార్ ల్యాండ్ రోవర్‌లకు మన దేశంలో... ఇక్కడ ఉత్పత్తయ్యే టాటా ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లకు బ్రిటన్‌లో మార్కెట్ లభ్యత పెరుగుతుంది. మన దేశం నుంచి వెళ్లే 99 శాతం ఎగుమతులకు కూడా ఎఫ్‌టీఏ అమల్లోకొస్తే సుంకాల బెడద వుండదు. బ్రిటన్ నుంచి మనకొచ్చే దిగుమతులపై సుంకాలు 15 శాతం నుంచి ఒక్కసారిగా 3 శాతానికి పడిపోతాయి. చాలా సరుకులపై కస్టమ్స్ సుంకాలు తగ్గిపోతాయి. మన సాగు రంగానికి ఎఫ్‌టీఏ ఎంతగానో దోహదపడుతుందని వాణిజ్య నిపుణులంటున్నారు. ప్రస్తుతం బ్రిటన్‌కు మన వార్షిక సాగు ఎగుమతుల విలువ కేవలం 81 కోట్ల డాలర్లు. ఈ ఒప్పందం వల్ల మన నుంచి తేయాకు, మామిడిపళ్లు, ద్రాక్ష, సుగంధ ద్రవ్యాలు, చేపలు, రొయ్యలు, ఎండ్రకాయలు వగైరాల ఎగుమతులు అపారంగా పెరుగుతాయని అంచనా వుంది. సేవల రంగా నికి సంబంధించినంతవరకూ యోగా బోధకులు, సంగీతవేత్తలు, పాకశాస్త్ర ప్రవీణులకు డిమాండ్ పెరుగుతుంది. ఈ రంగాల్లో పనిచేసే వారికోసం ఏటా 1,800 వీసాలు జారీచేస్తారు. వాహన విడి భాగాలు, వస్త్రాలు, పాదరక్షలు, క్రీడోపకరణాలు, ఆటబొమ్మలు, బంగారం, వజ్రాభరణాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, సేంద్రీయ రసాయనాలు, ఇంజిన్లు వగైరాలపై దాదాపు 4 నుంచి 16 శాతం వరకూ సుంకాలు విధిస్తున్నారు. ఒప్పందం అమల్లోకొస్తే ఆ సుంకాలు కనుమరుగవుతాయి. కనుక ఎగుమతులు ఊపందుకుంటాయి. పర్యవసానంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఎఫ్‌టీఏపై రెండు దేశాల్లోనూ విమర్శలూ, ఆందోళనలూ వున్నాయి. ఇది అమల్లోకొస్తే స్వల్పకాలిక వీసాపై వచ్చే భారతీయ కార్మికులకూ, వారి యాజమాన్యాలకూ జాతీయ బీమా సంస్థ ఎన్ఐసీకి చేసే చెల్లింపుల నుంచి మూడేళ్ల మినహాయింపు ఇవ్వదల్చుకున్నారని, ఇందువల్ల దేశ ఖజానాకు ఏటా పది లక్షల పౌండ్ల నష్టంతోపాటు దేశీయ కార్మికుల ఉపాధికి గండిపడుతుందని కన్సర్వేటివ్ పార్టీ ఆరోపిస్తోంది. ప్రస్తుతం ఆ మినహాయింపు ఏడాది కాలానికి మాత్రమే వుంది. వలస విధానం మారదని, ఇప్పటికన్నా భారతీయ కార్మికుల సంఖ్య పెరిగే అవకాశం లేదని ప్రభుత్వం చెబుతోంది. తమ రంగాన్ని ఎఫ్‌టీఏ విస్మరించిందని, మేధోహక్కుల పరిరక్షణ సంగతి పట్టించుకోలేదని బ్రిటన్ ఫార్మా రంగం ఆరోపణ. ఒకవేళ పట్టించుకుని ఉంటే మన దేశంలో జెనెరిక్ ఔషధ పరిశ్రమ దెబ్బతింటుంది. ఆటోమొబైల్ విడిభాగాల రంగంలో బ్రిటన్ ప్రవేశిస్తే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) రంగం నష్టపోతుంది. అందుకు ప్రతిగా మన ఎంఎస్ఎంఈలకు కూడా బ్రిటన్ చోటిస్తే వేరుగా వుండేది. ఇక 2027 నుంచి బ్రిటన్ అమలుచేయబోతున్న 'కార్బన్ టాక్స్' అంశాన్ని ఏం చేశారో వెంటనే తెలియలేదు. కార్బన్ టాక్స్ వల్ల మన ఇనుము, ఉక్కు, అల్యూమినియం, ఎరువులు, సిమెంట్ రంగాలు దెబ్బతినే అవకాశం వుంది. మొత్తానికి ఎఫ్‌టీఏ అమల్లోకొచ్చాకే దాని అసలు కథ ఏమిటన్నది తెలుస్తుంది.

# అమెరికా బెదిరింపుల బిల్లు వెనక్కు!



భారత్, బ్రెజిల్, చైనా, రష్యాలను బెదిరించే ఆంక్షలు, పన్నుల బిల్లును పక్కన పెట్టాలని అమెరికా నిర్ణయించింది. పార్లమెంటు ఎగువసభ వందమంది ఉండే సెనెట్‌లో ఉన్న రిపబ్లికన్లు, వారితో చేతులు కలిపిన ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీకి చెందిన వారితో సహా 85 మంది దీన్ని ప్రవేశపెట్టారు.తాను అధికారానికి వచ్చిన 24 గంటల్లోపు ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరిస్తానని ప్రగల్భాలు పలికిన డోనాల్డ్ ట్రంప్ చేతగాక వెల్లకిలా పడ్డాడు. నిజానికి దాన్ని సృష్టించిందే అమెరికా, దానికి తానతందాన అనే పశ్చిమదేశాల వారన్నది జగమెరిగిన సత్యం.నిజంగానే పోరు ముగించేందుకు ట్రంప్ తన పలుకుబడిని వినియోగిస్తాడని నమ్మినవారు కూడా లేకపోలేదు. ఈ క్రమంలో ట్రంప్ వేసిన అనేక పిల్లిమొగ్గల్లో 500శాతం పన్ను విధిస్తానన్న బిల్లు ఒకటి. మిలిటరీ చర్య నిలిపివేయా లంటూ జూలై 14న డోనాల్డ్ ట్రంప్ రష్యాకు యాభై రోజుల గడువు విధించిన సంగతి తెలిసిందే. ఆ వ్యవధి ముగిసే వరకు వేచి చూడాలనే సాకుతో ముందుకు పోరా దని నిర్ణయించినట్లు చెప్పినప్పటికీ పరువుపోవటం తప్ప సదరు ఆంక్షలను ఎవరూ ఖాతరు చేయరని అవగతం కావటమే వెనుక ఉన్న అసలు కారణం. దిక్కుతోచని స్థితిలో ఏం చేయాలో పాలుపోక 50రోజుల గడువు ముగిసేలోగా మరో కొత్త ఎత్తువేసేందుకు తాత్కాలికంగా బిల్లును పక్కన పెట్టారని చెప్పవచ్చు. పదే పదే హెచ్చరికలు చేస్తే నిజం చెప్పినా నమ్మని స్థితి ఏర్పడింది. అందుకే తన బదులు నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రూటే, తాజాగా బిల్లు ప్రధాన రూపకర్త, తన అనుచరుడు సెనెటర్ లిండ్సే గ్రాహమ్‌ను ట్రంప్ రంగంలోకి దించాడు. 'మా నేతతో పెట్టుకుని స్వయంగా పెద్ద ఆపదకొని తెచ్చుకున్నావ్, మీ ఆర్థిక వ్యవస్థను నలిపేస్తాం, ఉక్రెయిన్‌కు ఆయుధాలను అందచేస్తున్నాం, మీ అంతం చూస్తాం' అంటూ పుతిన్‌ను ఉద్దేశించి ఒక టీవీ సంభాషణలో గ్రాహమ్ వ్యాఖ్యానించాడు. మొగుడు ఏదో అంటే చివరికి ముష్టివాడు కూడా అదే అన్నాడన్న సామెత మాదిరి చివరికి గ్రాహమ్ కూడా చైనా, భారత్, బ్రెజిల్‌ను బెదిరించేందుకు పూనుకున్నాడు. తమ అధ్యక్షుడు చెప్పినట్లు వినకపోతే మూడు దేశాల ఆర్థిక వ్యవస్థలను నలిపివేస్తామంటూ చిందులు వేశాడు, రష్యాతో సంబంధాలు వదులుకోకపోతే వంద, అంతకంటే ఎక్కువ శాతం పన్నులు వేస్తామని బెదిరించాడు. మనకు మిత్రుడిగా నటించే ట్రంప్ అండదండలు, కనుసైగలు లేకుండా ఒక సెనెటర్ అలా బరితెగిస్తాడని అనుకోలేము.ట్రంప్ అన్నమాటలనే ఖండించేందుకు నోరురాని మన బలహీనత చివరికి ఒక పార్లమెంటు సభ్యుడిని కూడా విమర్శించలేని స్థితిలోకి నెట్టేసింది. ఉక్రెయిన్ సంక్షోభం గురించి రష్యా వేసుకున్న అంచనాలు ఒకటైతే పశ్చిమదేశాల అంచనాలు మరొకటి. తనకున్న అస్త్రశస్త్రాలతో ఉక్రెయిన్‌ను కొద్ది రోజుల్లోనే దారికి తేవచ్చు అనుకున్న పుతిన్ పశ్చిమదేశాలు అందించే నిఘా సమాచారం, ఆధునిక ఆయుధాలు, ఆర్థిక సాయం గురించి వేసిన అంచనాలు తప్పాయి. తమ ఆయుధాలతో రష్యాను వెనక్కు కొట్టవచ్చన్న పశ్చిమదేశాల అంచనా కూడా తప్పింది. పంథా మార్చిన పుతిన్ మిలిటరీ చర్యను కొనసాగిస్తూ మెల్లమెల్లగా ఉక్రెయిన్ ప్రాంతాలను అదుపులోకి తెచ్చుకుంటున్నాడు. కొరకరాని కొయ్యగా మారాడు. ఆగస్టు ఒకటవ తేదీలోగా తాము చెప్పినట్లు తమతో వాణిజ్య ఒప్పందాలకు రావాలని ట్రంప్ ప్రపంచాన్ని రెండవసారి బెదిరించినా నాటి నుంచి ఎలాంటి స్పందన లేదు. బ్రిక్స్‌లో ఉన్న మూడు నాలుగు ప్రధాన దేశాలను బెదిరిస్తే మిగతావి భయపడిపోతాయని ట్రంప్ ఊహించినట్లు ఉన్నాడు. చైనాతో ఒప్పందం కుదిరిందని చెప్పినప్పటికీ అమెరికా ఎంత వెనక్కు తగ్గితే చైనా కూడా అంతమేరకే ప్రతిస్పందిస్తోంది. మన దేశం మీద తీవ్రఒత్తిడి తీసుకువస్తున్నాడు, జూలై తొమ్మిది గడువు ముగిసింది, రెండవది కూడా సమీపిస్తున్నది. ఒప్పందం కోసం మన ప్రతినిధులు వెంపర్లాడుతూ ఒకటికి రెండుసార్లు బతిమిలాడుతూ వాషింగ్టన్ వెళ్లి రావటం తప్ప వాణిజ్యలోటులో ఉన్న అమెరికన్లు ఢిల్లీ రాలేదు. కారణాలు ఏవైనా రష్యా మీద ఆంక్షల పేరుతో ప్రవేశపె ట్టిన అమెరికా బెదిరింపుల బిల్లు వెనక్కుపోయింది. అంత మాత్రాన ట్రంప్ తగ్గుతాడని భావిస్తే పొరపాటే. కలసి ఉంటే కలదు సుఖం అన్నట్లుగా అతగాడి మెడలు వంచాలంటే చైనా, భారత్, రష్యా, బ్రెజిల్ కలసి వచ్చే ఇతరదేశాలతో ఉమ్మడిగా బుద్ధి చెప్పేందుకు ఆలోచించాలి.బలవంతుడైన సర్పము చలిచీమల చేతిలో చచ్చినట్లు అమెరికాకు బుద్ధి చెప్పాల్సిందే!

# పోలీసు వ్యవస్థకు చెంపపెట్టు



దాదాపు ఇరవయ్యేళ్ల కిందట ముంబయి సబర్బన్ రైళ్లలో జరిగిన పేలుళ్ల కేసులో నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేస్తూ ముంబయి హైకోర్టు ఇచ్చిన తీర్పు పోలీసు వ్యవస్థకు చెంపపెట్టులాంటిది. అదే సమయంలో, న్యాయం అందడంలో జరుగుతున్న అలవిమాలిన జాప్యాన్ని, న్యాయవ్యవస్థలోని లోటుపాట్లను కూడా ఈ తీర్పు ఎత్తిచూపుతోంది. 2006 జులై 11న బాగా రద్దీగా ఉండే ముంబయి పశ్చిమ రైల్వేలైన్‌లో ఏడు సబర్బన్ రైళ్లలోని ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంట్లలో ఐదు నిమిషాల వ్యవధిలో పేలిన బాంబులు 189 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నాయి. ఈ దుర్ఘటనలో 820 మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటన అనంతరం యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటిఎస్) రంగంలోకి దిగి, 'క్షుణ్ణంగా' దర్యాప్తు చేసి 12 మందిని న్యాయస్థానం ముందు నిలబెట్టింది. సుదీర్ఘ విచారణ అనంతరం వీరిలో ఐదుగురికి మరణ శిక్ష, మిగిలిన ఏడుగురికి జీవితఖైదు విధిస్తూ మోకా (మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్స్) ప్రత్యేక కోర్టు 2015లో తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై మరణశిక్ష పడిన ఐదుగురు దోషులు హైకోర్టును ఆశ్రయించారు. గత పదేళ్లుగా పెండింగులో ఉన్న ఈ కేసుపై గత ఏడాది జులై నుంచి హైకోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక ద్విసభ్య ధర్మాసనం రోజువారీ విచారణ జరుపుతోంది. దాదాపు పదేళ్ల తర్వాత సోమవారం 671 పేజీలతో సుదీర్ఘమైన తీర్పు వెలువరించిన ధర్మాసనం.. దర్యాప్తులో పోలీసు వ్యవస్థ లొసుగులను, లోటుపాట్లను ఎండగట్టింది. అభియోగాలను రుజువు చేయడంలోనే కాదు, సాక్షులుగా ప్రవేశపెట్టినవారి వాంగ్మూలాల్లోనూ ఏమాత్రం పస లేదని ధర్మాసనం తేల్చేసింది. నిందితులను హింసించి, బలవంతంగా నేరం ఒప్పించినట్లు కనబడుతోందన్న న్యాయమూర్తుల వ్యాఖ్యలకు యావత్తు పోలీసు శాఖ సిగ్గుతో తలవంచుకోవలసిందే. సరైన ఆధారాలు లేకుండా నిందితులు నేరం చేశారని నమ్మడం కష్టమని కోర్టు కుండబద్దలు కొట్టింది. పేలుళ్లకు ఏ రకమైన పదార్థాన్ని వినియోగించారో కూడా చెప్పలేని దర్యాప్తు అధికారుల పనితనాన్ని ఆక్షేపించింది. వీటన్నింటికీ మించి, పేలుళ్లు జరిగిన నాలుగేళ్లకు నిందితులను గుర్తించేందుకు పెరేడ్ నిర్వహించడం విధినిర్వహణలో దర్యాప్తు అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా చెప్పుకోవచ్చు. అంతకుమించి, నిందితుల కాల్ డేటాగా చెబుతూ సేకరించిన వివరాలను నిందితులకు చూపించకపోవడం, ఆ తర్వాత ఆ ఆధారాలను ధ్వంసం చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు కోర్టు ముందు ప్రవేశపెట్టిన పన్నెండుమందీ పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలకు చెందినవారుగా నిరూపించే సాక్ష్యాలేవీ సేకరించలేకపోవడం వారి చేతగానితనానికి నిదర్శనం. న్యాయస్థానాల్లో సుదీర్ఘంగా నడిచిన ఈ కేసు అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇరవయ్యేళ్లపాటు జైళ్లలో మగ్గిపోయిన ఈ పన్నెండుమందీ ఎంతో విలువైన తమ జీవితకాలాన్ని కోల్పోయారు. అందుకు ఎవరు బాధ్యత వహిస్తారు? ఇన్నేళ్లుగా వారి కుటుంబ సభ్యులు పడిన మనోవేదనకు కారకులు ఎవరు? దర్యాప్తులో హైకోర్టు ధర్మాసనం పేర్కొన్న లోపాలేవీ అంతకుముందు విచారించిన ప్రత్యేక కోర్టు దృష్టికి రాకపోవడం శోచనీయం. తాజాగా కోర్టు తీర్పుతో విడుదలైన పన్నెండుమందిలో అసలు నేరస్థులు ఉండవచ్చు, ఉండకపోవచ్చు. ఎందుకంటే, ప్రాసిక్యూషన్ సరైన సాక్ష్యాలను, ఆధారాలను చూపించలేకపోవడం వల్లనే వీరంతా నిర్దోషులుగా విడుదలయ్యారన్న సంగతి గమనార్హం. ఒకవేళ వీరిలో ఎవరైనా ఆనాడు పేలుళ్లకు పాల్పడి ఉంటే, వారు విడుదలై, మళ్లీ సమాజంలోకి వచ్చినందుకు బాధ్యత వహించవలసింది పోలీసు వ్యవస్థే. దర్యాప్తును ఇంత లోపభూయిష్టంగా చేపట్టిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. ఇన్నేళ్లూ జైల్లో ఉన్నవారు నేరస్థులు కాకపోతే ఆనాటి పేలుళ్లకు కారకులెవరని ప్రశ్నిస్తున్న బాధిత కుటుంబాలకు పోలీసులు ఏం సమాధానం చెబుతారు? ఇక న్యాయవ్యవస్థ విషయానికొస్తే, న్యాయం అందడం ఆలస్యమైతే అన్యాయం జరిగినట్లేనన్నది నానుడి. కానీ, న్యాయస్థానాల్లో కేసుల విచారణకు ఏళ్లూపూళ్లూ పడుతోందనడానికి ఈ కేసే ఓ తాజా ఉదాహరణ. 189 మంది మరణానికి దారితీసిన బాంబు పేలుళ్ల వంటి కీలకమైన కేసు తేలేందుకే దాదాపు ఇరవయ్యేళ్లు పడితే ఇక మామూలు కేసుల సంగతి ఏమిటి? హైకోర్టు తీర్పు పట్ల విస్మయం ప్రకటించిన మహారాష్ట్ర సర్కారు ఈ కేసుపై సుప్రీంకోర్టు తలుపు తట్టింది. తక్షణమే విచారణ చేపట్టవలసిందిగా రాష్ట్రప్రభుత్వం చేసిన విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుని, త్వరలో విచారణ ప్రారంభించేందుకు సర్వోన్నత న్యాయస్థానం సమ్మతించింది. ఈ కేసు తేలేసరికి ఎంత కాలం పడుతుందో తెలియదు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకూ జైలు గోడల మధ్య బతుకు వెళ్లదీసిన ఈ పన్నెండుమందినీ విచారణ సమయంలో మళ్లీ జైలుకు పంపకుండా ఉంటే, అదే పదివేలు!

## సీఎంలో అపరిచితుడు ఉన్నాడు.. కేటీఆర్ ఘాటు విమర్శలు



**హైదరాబాద్, :** కామారెడ్డి జిల్లా లింగంపేటలో బీఆర్ఎస్ పార్టీ ఘనంగా నిర్వహించిన ఆత్మగర్జన సభలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎంలో అపరిచితుడు ఉన్నాడు.. ఒక్కోసారి రెమో, రామ్‌లా కనిపిస్తాడు అని చెప్పుకొచ్చాడు. ప్రజలకు నిజమైన ముఖాన్ని చూపకుండా నటిస్తున్నాడు అని మండిపడ్డారు. ఇక, రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధు నిధులు ఇంకా అందలేదు.. కానీ, మూటలు డిల్లీకి వెళ్తున్నాయి.. రాహుల్ గాంధీ ఖాతాలో డబ్బులు పడుతున్నాయ్ అంటూ కేటీఆర్ ఆరోపించారు. ఇక, కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు ఇప్పుడు కాగితాలు ఇచ్చి నేనే ఉద్యోగాలు ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి చెబుతున్నారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇది ప్రజలను మోసగించడమేనన్నారు. ప్రభుత్వాన్ని నడిపించే వాడు నిజంగా బాధ్యత గల నాయకుడు అయితే సంపద, ఆదాయం పుడుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. మీ ఓటే తూటా.. కాంగ్రెస్ బట్టలు విప్పాలి అన్నారు. అలాగే, గురుకులాల్లో విద్యార్థులకు విషం పెడుతున్నారు.. ఇప్పటి వరకు 100 మంది విద్యార్థులు చనిపోయారు అని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మెట్రోపై రాష్ట్ర ప్రభుత్వానికి అవగాహన లేదు..
### సీఎం పచ్చి అబద్ధాలు..!



**హైదరాబాద్, :** హైదరాబాద్ మెట్రో ఫేస్- 2 గురించి తెలంగాణ ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు చెబుతున్నారు అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ఈ మధ్యనే డిపీఆర్ కేంద్రానికి వచ్చింది.. మెట్రోపై అవగాహన లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడుతుంది.. మెట్రో గురించి కాంగ్రెస్ సర్కార్ ఇంకా సమాచారం ఇవ్వాల్సి ఉంది.. సీఎంకి మెట్రో గురించి అవగాహన లేదు.. మెట్రో లైన్ల నిర్వాహణ ఎవరు చేస్తారు.. నష్టాలు ఎవరు భరిస్తారు.. గతంలో ఇచ్చిన సంస్థకు రెండో దశ నిర్మాణ నిర్వాహణ ఇస్తారా.. కొత్త సంస్థ వస్తే వాటితో సమన్వయం ఒప్పందం అంశాలు కేంద్రానికి తెలియజేయాల్సి ఉంటుందన్నారు. మెట్రో విషయంలో కేంద్రం రాష్ట్రానికి సహకారంతో పాటు నిధులను ఇస్తుంది.. మెట్రో విషయంలో కేంద్ర- రాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటుకు మోడీ సర్కార్ సిద్ధంగా ఉంది అని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇక, నేను రాష్ట్ర అంశాలను అనేక సార్లు కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లాను అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వేసే పనికిరాని ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాను అని తేల్చి చెప్పారు. కేసీఆర్ ను కాపాడాలని రాహుల్ గాంధీ చూస్తున్నారు.. కాంగ్రెస్- బీఆర్ఎస్ పార్టీల మధ్య అవగాహన కుదిరింది.. ఇక, బండి సంజయ్- ఈటల రాజేందర్ విషయంలో బీజేపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది అని కిషన్ రెడ్డి తెలిపారు.

## ప్రతిపక్షం షాకింగ్ నిర్ణయం..
## ధన్‌ఖర్‌కు వీడ్కోలు విందు ఏర్పాటు!



**న్యూఢిల్లీ,:** జగదీప ధన్‌ఖర్ అనూహ్యంగా ఉపరాష్ట్రపతి పదవి నుంచి తప్పుకున్నారు. ఊహించని రీతిలో రాజీనామా చేశారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం అయింది. ఇంత హఠాత్తుగా రాజీనామా చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని పొలిటికల్ సర్కిల్‌లో పెద్ద చర్చనే నడిచింది. అనారోగ్య కారణాలతో వైదొలగుతున్నట్లు ధన్‌ఖర్ ప్రకటించినప్పటికీ.. రాజీనామా వెనుక ఏదో మతలబు జరిగిందని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఆరోపించింది. ఇదిలా ఉంటే ధన్‌ఖర్ (74) వీడ్కోలు ప్రసంగం చేయకుండానే ఉపరాష్ట్రపతి పదవి నుంచి వైదొలగారు. ఈ నేపథ్యంలో ధన్‌ఖర్‌కు వీడ్కోలు విందు ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. వీడ్కోలు విందుకు రావాలంటూ ధన్‌ఖర్‌ను ఆహ్వానించినట్లు వర్గాలు పేర్కొన్నాయి. రాజ్యసభ వర్కింగ్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో వీడ్కోలు ప్రసంగం చేయాలని ధన్‌ఖర్‌ను కోరినట్లు సమాచారం. అయితే ప్రతిపక్షాల ప్రతిపాదనను ధన్‌ఖర్ అంగీకరించరని వర్గాలు పేర్కొన్నాయి. అలా చేస్తే రాజకీయంగా మరో వివాదాస్పదం అవుతుందని ఆయన భావించినట్లు తెలుస్తోంది. సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు ధన్‌ఖర్ బాగానే హాజరయ్యారు. అయితే జస్టిస్ యశ్వంత్ వర్మపై చర్యలు తీసుకోవాలంటూ ప్రతిపక్షాలు ఇచ్చిన తీర్మానాన్ని ధన్‌ఖర్ ఆమోదించారు. వాస్తవానికి కేంద్రమే ఈ ప్రతిపాదన తీసుకురావాలని ఆలోచన చేస్తోంది. ఇంతలోనే ధన్‌ఖర్ తొందరపడి ప్రతిపక్షాలు ఇచ్చిన తీర్మానాన్ని ఆమోదించేశారు. ఇదే కేంద్ర పెద్దలకు కోపం తెప్పించింది. ఈ నేపథ్యంలో ఆయన్ను పదవి నుంచి తప్పించాలని ప్లాన్ చేసింది. కానీ ఇంతలోనే బీజేపీ నేతలు.. ఆయన చెవుల్లో ఊదేశారు. కేంద్రం చర్యలు తీసుకోకముందే.. ముందే రాజీనామా చేసేశారు. అనారోగ్య కారణాల చేత రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్రపతికి లేఖ పంపారు. అయితే ఈ రాజీనామా రాజకీయంగా చాలా దుమారమే రేపింది. ఇక ఉపరాష్ట్రపతి ఎంపిక కోసం ఈసీ కసరత్తు ప్రారంభించింది. ఈసారి పార్టీ విధేయుడికే ఆ పదవి కట్టబెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

## ముంబైను ముంచెత్తిన భారీ వర్షాలు.. నిలిచిన ప్రజా రవాణా



**న్యూఢిల్లీ,:** ఆర్థిక రాజధాని ముంబైను భారీ వర్షాలు ముంచెత్తాయి. నవీ ముంబై, థానేలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు నగరం అతలాకుతలం అయింది. రహదారులు జలమయం అయ్యాయి. ఉదయాన్నే డ్యూటీలకు వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉంటే అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని అధికారులు ప్రజలను కోరారు. మహారాష్ట్రలో కొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా.. ఇంకొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇక నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. జూలై 25, 26 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆదివారం మాత్రం పరిస్థితి మెరుగ్గా ఉంటుందని చెప్పింది. మోస్తరు వర్షాలు మాత్రమే ఉంటాయని వెల్లడించింది. ఇక ముంబైలో భారీ వర్షాలు కురుస్తున్నందున ముంబై, సమీప జిల్లాల్లోని నివాసితులు ఇళ్లలోనే ఉండాలని, తీరప్రాంతాలకు దూరంగా ఉండాలని ముంబై పోలీసులు శుక్రవారం సూచించారు. ఇక భారీ వర్షాలు కారణంగా ముంబై లోకల్ ట్రైన్ సర్వీసులు నిలిచిపోయాయి. కొన్ని సర్వీసులు నిలిపోగా.. ఇంకొన్ని సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లిస్తున్నారు. ఇక రహదారులపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## వర్షాకాలం.. స్వీయ జాగ్రత్తలే శ్రేయస్కరం





వచ్చే రెండు మాసాలు వర్షాలు, వరదలు వచ్చేకాలం ఎవరికి వాళ్ళు తీసుకునే తగు జాగ్రత్తలే ప్రాణ నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుంది. ఎమరుపాటుతో ఉంటే జీవితాలను అతలాకుతలం చేస్తాయి. మీరు తీసుకునే నివారణ చర్యలే మిమ్మల్ని మీరు కాపాడుకునే అవకాశం ఉంటుంది. అనుకోని విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు అందుబాటులో ఉన్నవారికి, ప్రభుత్వానికి అత్యవసర కమ్యూనికేషన్ కోసం మీ మొబైల్ ఫోన్‌లను ఛార్జ్ చేసి ఫుల్‌చేసి ఉంచుకోండి. ఎప్పటికప్పుడు వాతావరణ అప్‌డేట్స్ కోసం రేడియో వినండి, టివి చూడండి, వార్తాపత్రికలను చదవండి, అధికారిక వాతావరణ బులెటిన్స్ చూడండి. కొన్ని రోజుల వరకు సరిపడేలా తగినన్ని ఆహార పదార్థాలను, నిత్యావసర సరుకులు, నీటిని నిల్వ చేసుకొని, అత్యవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోండి. విలువైన పత్రాలు, సర్టిఫికేట్లు, విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ బ్యాగ్‌లలో భద్రపరచండి, వర్షాలు, వరదలు ఉన్నా, తగ్గినా కొద్ది రోజులపాటు వేడిచేసిననీటిని మాత్రమే తాగండి. సమీపంలోని కాలువలు, చెరువులు, డ్రైనేజీ ఛానల్స్ లాంటి వరదవచ్చే అవకాశం ఉన్న ప్రాంతాల గురించి తెలుసుకోండి. మీకు దగ్గరలో ఏదైనా బహిరంగ కాలువలు లేదా మ్యాన్‌హోల్‌ల వద్ద స్పష్టంగా కనిపించేలా ఎరుపు జెండాలు లేదా బారికేడ్లు లేదా మరే ఇతర ఏవైనా సంకేతాలు ఉంచండి. తప్పని పరిస్థితులలో వర్షంలో బయటకు వెళాల్సి వస్తే ఒక కర్రను తీసుకుని, నీటి లోతు చూసిన తర్వాతే అక్కడ అడుగులు వేస్తూ వెళ్ళండి. వర్షం నీరు నిలువ ఉంటే దోమలు, ఇతర క్రిమికీటకాలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. మీ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ, క్రిమిసంహారకాలను ఉపయోగించండి. వర్షాలు ఎక్కువపడి వరదనీరు ఇంట్లో నీరు చేరితే మెయిన్ స్విచ్‌ను ఆఫ్ చేయండి. విద్యుత్ ఉపకరణాలను అన్‌ప్లగ్ చేయండి, గ్యాస్ కనెక్షన్‌ను ఆఫ్ చేయండి. పశువులు, పెంపుడు జంతువులను షెడ్‌లో ఉంచండి, వాటిని తాళ్లతో కట్టేయకండి, మీకు పై అంతస్తు ఉంటే విలువైన వస్తువులను పైఅంతస్తుకు తరలించండి, మీ ప్రాంతంలోని హెల్ప్ లైన్ నెంబర్లను ఫోన్‌లో సేవ్ చేసుకోండి. అది మీకు అవసరం లేకున్నా, అవసరమైన వాళ్లకు ఉపయోగపడవచ్చు, కాలనీలో ఉండేవాళ్ళు కాలనీ ప్రజలు అందరూ కలసి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని ఒకరికి ఒకరు ఆసరా అవ్వండి. అత్యవసర సమయంలో సంప్రదించడానికి మీకు దగ్గరలో ఉన్న ఆసుపత్రి నంబర్లను, అగ్నిమాపక అధికారుల నంబర్లు, స్థానిక పోలీస్ స్టేషన్ నంబర్లు రాసుకొని జాగ్రత్త పరచుకోండి. మీ ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ గ్రామ పంచాయితీకి, మున్సిపాలిటీ, జిహెచ్‌ఎంసి పరిధిలో ఉంటే వాళ్ళ నంబర్లు సిద్ధం చేసుకొని ఉంచుకోండి. చెత్తను ఎక్కువగా ఉంచకండి. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రపరచుకోండి. వరద ముప్పు ఉన్న ప్రాంతాలలో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఎమర్జెన్సీ కిట్‌ను సిద్ధపరచుకోండి. వర్షాలు తగ్గిన తర్వాత మలేరియా వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి తప్పనిసరిగా దోమతెరలను ఉపయోగించండి. రోడ్ల పైన నడిచేవాళు ్ళ పక్కన ఉండే కరెంటు స్తంభాలను తాకుండా నడవండి. కరెంటు ఎక్కడైనా తెగిపడ్డట్టు కనిపిస్తే దూరంగా ఉండండి, ఆ ప్రాంతం నుంచి వెళ్ళకండి. చెట్ల కింద, పురాతన భవనాల క్రింద నిలబడకండి. పిడుగులు పడే సమయంలో అందరూ జాగ్రత్తగా ఉండండి. పిడుగులు పడే సమయంలో పసిపిల్లలకు అత్యంత భద్రతా కలిపించండి. నదులలో, సముద్రంలో వేటకు వెళ్ళేవాళ్ళు వరదలు తగ్గేవరకూ వెళ్లకుండా ఉండాలి, ఇతరులు సముద్రంలోపలికి వెళ్లకుండా నిరోధించేలా చర్యలు తీసుకోవాలి. విపరీతంగా వర్షాలు పడే సమయంలో రైతులు పొలం పనులు చేయకుండా ఉండాలి. గొర్రెలు, మేకలు, బర్రెలు ఇతర జంతువులను మేపేవాళ్లు ఎత్తైన ప్రదేశంలో ఉండేలా చూసుకోవాలి. స్కూల్, కాలేజీలకు వెళ్లే విద్యార్థిని, విద్యార్థులు కచ్చితంగా గొడుగు, రెయిన్ కోట్‌ను తప్పనిసరిగా తీసుకెళ్లాలి. ముంపు ప్రాంతాలలో ప్రజలు చిక్కుకుంటే వారికి ఆహారం, నీరు, నిత్యావసర వస్తువులు అందించేలా ప్రభుత్వం సిద్ధం చేసుకోవాలి, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజల ఆరోగ్యానికి కావలసిన ఔషధాలు, ఇతర సామాగ్రిని సిద్ధం చేసుకోవాలి. ప్రతి ఆసుపత్రిలో సిబ్బంది కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ సూచనలు ఎప్పటికప్పుడు ప్రజలు తెలుసుకొని అప్రమతంగా ఉన్నప్పుడే మరింత భద్రంగా ఉంటారు.

## నకిలీ విత్తులతో రైతులు చిత్తు



ప్రతిసారి నకిలీ విత్తనాలతో రైతులు మోసపోతున్నారు. దేశానికి అన్నం పెట్టేటువంటి రైతులు దళారుల చేతిలో మోసపోతు గోసపడుతున్నారు. వానాకాలం ప్రారంభమైతే చాలు దుక్కులన్నీ చదును చేసుకుని, పంట లు వేసుకోవడానికి సిద్ధంగా ఉంటాయి. ఇక వారికి కావాల్సింది నాణ్యమైనటువంటి విత్తనాలు. ఈ నాణ్యమైనటువంటి విత్తనాలకోసం వారు వారికి దగ్గరలో ఉన్నటువంటి ప్రైవేటు ఫర్టిలైజర్స్ షాపులపైన ఆధారపడుతుంటారు. అందులో కొంతమంది నాణ్యమైన విత్తనాలను రైతులకు ఇస్తే, కొంతమంది డబ్బే ప్రధానంగా నకిలీ విత్తనాలను విక్రయిస్తూ సంపాదిస్తున్నారు. ఇటీవల కాలంలో రకరకాల పేర్లతో, రకరకాల కంపెనీలతో నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వర్షాలు ప్రారంభం కావడంతో నిషేధిత బిటి 3 (లూజ్) విత్తనాల విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నాయి. గ్రామాలకు సంబంధించిన కొంతమంది ఓ ముఠాగా ఏర్పడి చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుండి నకిలీ బీటి 3 విత్తనాలను దిగుమతి చేసి రైతులకు కిలో రూ. 3000 లకు రైతులకు విక్రయిస్తున్నారు. ఇవేకాక రైతులు పెట్టేటువంటి పత్తి, వరి, మొక్కజొన్న, ఇతర పంటలకు సంబంధించిన, కూరగాయల, పండ్ల పంటలకు సంబంధించిన నకిలీ విత్తనాలు మార్కెట్లలో చాలాచోట్ల పట్టుబడుతున్నాయి. నకిలీ విత్తనాలే కాకుండా నకిలీ మందులు కూడా అనేకంగా ఉన్నాయి. పంటపై పిచికారి చేసేందుకు ప్రభుత్వ నిషేధిత గ్లైపోసెట్ మందులు సైతం ముందస్తుగానే సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ప్రతి వానకాలం సీజన్‌లో కొంత మంది ముఠా సభ్యులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలిసినప్పటికీ సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు తూతూ మంత్రంగా ఎరువుల దుకాణాల తనిఖీలు చేస్తున్నామంటూ చేతులు దులుపుకోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నకిలీ బిటి 3 విత్తనాల అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవి మంచి విత్తనాలను తీసుకొచ్చినటువంటి రైతులు వారి పొలాల్లో నాటి కొద్దిరోజుల తర్వాత పూత ఖాతా రాకపోవడం వల్ల అవి నకిలీ అని గుర్తించి అధికారులకు సమాచారం ఇస్తున్నారు. పంట వేసిన తర్వాత దానికి కొంత పెట్టుబడి కూడా పెట్టడం జరుగుతుంది. మరి ఈ నకిలీ విత్తనాలను గుర్తించడానికి రైతులకు అనేక అవగాహన కార్యక్రమాలు పెట్టినప్పటికీ, చదువు లేనటువంటి వారు వాటిని గుర్తించలేకపోతున్నారు.ముందుగా వారు కొనే ప్రతి విత్తనానికి ఫర్టిలైజర్ షాపుల యజమానితో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తన అనుమతులు పొందిన మంచి కంపెనీల గుర్తింపు పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనాలి. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందినటువంటి లైసెన్స్ కలిగినటువంటి డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు తీసుకోవాలి. స్థానికంగా ఉన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు, ప్రభుత్వ వ్యవసాయ పనిముట్లు విత్తనాలు విక్రయించేటువంటి వారి వద్ద మాత్రమే విత్తనాలను తీసుకోవాలి. విత్తనాల బ్యాగును క్షుణ్ణంగా పరిశీలించి, దానిపైన ఉండే హాలో గ్రామ్ ఉందో లేదో సరిచూసుకొవాలి. ప్రతి బ్యాగ్‌కు బార్ కోడ్ ఉంటే దాన్ని స్కాన్ చేసినట్లయితే దాని పూర్తి వివరాలు మనకి కనిపిస్తాయి. విత్తన సంచి వెనక స్టిక్కర్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రైవేటు కంపెనీల విత్తన సంచుల వెనుక భాగంలో పచ్చరంగు ట్యాగ్ అంటే రూట్ ఫుల్ లేబుల్ అని, లేదా నీలి ట్యాగ్ ఆధారంగా సర్టిఫైడ్ సీడ్ అని గుర్తించాలి. పత్తి, మిరప వంటి విత్తనాలకు పచ్చ ట్యాగ్ ఉండేలా చూసుకోవాలి. ప్రతి ట్యాగ్ పైన లైసెన్స్ లార్డ్ నెంబర్ క్యూఆర్ కోడ్ ఉంటేనే అది నమ్మకమైన విత్తనంగా గుర్తించాలి. మరొక ముఖ్య విషయం ఏమిటంటే ప్యాకింగ్ తేదీ, చెల్లుబాటు గల తేదీలను ముద్రించబడి ఉన్నాయా లేదా అనేది చూసుకోవాలి. అలా లేని వాటిని కొనొద్దు. ఇవే కాకుండా జీవసాంకేతికతను ఉపయోగించి జన్యు శాతం వంటి ప్రమాణాలు తప్పక మొలక శాతం 80 కంటే ఎక్కువ. జన్యు శాతం 98 కంటే ఎక్కువగా ఉండేలా చూడాలి. ఇలా చూసుకుని ఉన్నప్పుడే రైతులు నకిలి విత్తనాలు నుండి ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారు. లేకపోతే అధిక నష్టం వాటిల్లవచ్చు. అందుకే ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రైవేటు విత్తన విక్రయ కేంద్రాల పైన దాడులు జరిపి అవి మన్నికైనవా కావా అనేటువంటిది చూసుకోవాలి. వాటి తయారీ కేంద్రాలకు వెళ్లి విత్తనాలను పరీక్ష చేయాలి. పకడ్బందీ చర్యలు తీసుకుంటేనే నకిలీ విత్తనాలను అరికట్టవచ్చు. ఆ దిశగా ప్రభుత్వం, వ్యక్తులు పనిచేయాలి.

## ధన్‌ఖడ్ సంచలన నిష్క్రమణ



ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు జగదీప్ ధన్‌ఖడ్ చేసిన ప్రకటన రాజకీయ వర్గాలనే కాక సామాన్య ప్రజలను సైతం ఆశ్చర్యపరచింది. ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉండగానే ఆయన తన పదవికి రాజీనామా ఎందుకు చేశారనేది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న. ఆరోగ్య కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించినప్పటికీ అంతకు మించిన బలమైన కారణమే ఉండి ఉంటుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నారు. జరిగిన పరిణామాలు సైతం ఆ ఆరోపణలను బలపరిచే విధంగా ఉండడం గమనార్హం. రాజీనామా ప్రకటన చేయడానికి కొద్దిగంటల ముందు కూడా ఆయన రాజ్యసభ చైర్మన్‌గా సభా కార్యకలాపాలను నిర్వహించారు. అంతేకాదు, బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఆయన మాటల్లో కానీ, చేతల్లో కానీ ఎక్కడా రాజీనామా చేస్తారన్న సంకేతాలు కనిపించలేదు. మధ్యాహ్నం 12.30 గంటలకు తొలుత బిఏసి సమావేశం జరగ్గా ఆ సమావేశానికి రాజ్యసభలో సభా నాయకుడు జెపి నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు సహా సభ్యులందరూ హాజరయ్యారు. మళ్లీ సాయంత్రం 4 గంటలకు సమావేశం కావాలని నిర్ణయించారు. అయితే సాయంత్రం జరిగిన సమావేశానికి నడ్డా కానీ, రిజిజు కానీ హాజరు కాలేదు.

దీంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ధన్‌ఖడ్ సమావేశాన్ని మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. అయితే రాత్రి 9 గంటల ప్రాంతంలో ఆరోగ్య కారణాల దృష్ట్యా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ధన్‌ఖడ్ తన 'ఎక్స్' ఖాతాలో ఉంచిన పోస్టులో పేర్కొన్నారు. ధన్‌ఖడ్ ప్రకటన రాజకీయ వర్గాలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇంత హఠాత్తుగా రాజీనామాకు ఆయన నిర్ణయం తీసుకోవడం వెనుక అంతకన్నా బలమైన కారణాలు ఏమయినా ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తం కావడం మొదలైంది. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చేసిన ట్వీట్ కూడా దీనికి బలం చేకూరుస్తోంది. మధ్యాహ్నం ఒంటిగంటనుంచి సాయంత్రం నాలుగున్నర మధ్య మూడున్నర గంటల సమయంలో తెరవెనుక అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయని, ఫలితంగానే నడ్డా, రిజిజులు బిఏసి సమావేశానికి ఉద్దేశపూర్వకంగానే రాలేదని, ముక్కుసూటి మనిషయిన ధన్‌ఖడ్ దీన్ని అవమానంగా భావించి రాజీనామా చేసి ఉంటారనేది జై రాం రమేశ్ ట్వీట్ సారాంశం. అయితే, వర్షాకాల సమావేశాల తొలి రోజు జరిగిన పరిణామాలే ధన్‌ఖడ్ రాజీనామాకు దారి తీసి ఉంటాయనే వాదన కూడా ఉంది. ఇంట్లో నోట్ల కట్టలు పట్టుబడిన ఉదంతంలో జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనను కోరుతూ ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసుకు ధన్‌ఖడ్ అంగీకరించడం ఆయన రాజీనామాకు కారణమయిందనేది విశ్వసనీయ వర్గాల కథనం. ఓవైపు జస్టిస్ వర్మ అభిశంసనకోసం లోక్‌సభలో తీర్మానం ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసును ధన్‌ఖడ్ స్వీకరించడం ప్రభుత్వానికి మింగుడుపడలేదని అంటున్నారు. కనీసం ప్రభుత్వానికి మాటమాత్రమైనా సమాచారం ఇవ్వకుండా ప్రతిపక్షాల నోటీసును స్వీకరించడంతో క్రెడిట్ అంతా ప్రతిపక్షాలకు వెళ్లిపోయినట్లయిందని ప్రభుత్వం భావించినట్లు చెబుతున్నారు. బిజెపి వ్యక్తి అయిన ధన్‌ఖడ్ తన చర్య ద్వారా 'లక్ష్మణ రేఖ' దాటారని ప్రధాని మోడీతో జరిగిన సమావేశంలో సీనియర్ మంత్రులు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఇదే ధన్‌ఖడ్ రాజీనామాకు దారి తీసి ఉంటుందనేది రాజకీయ వర్గాల అభిప్రాయం. వాస్తవానికి ధన్‌ఖడ్ మొదటినుంచి కూడా ముక్కుసూటి మనిషిగానే గుర్తింపు పొందారు. న్యాయవాదిగా, ఆ తర్వాత కేంద్రమంత్రిగా, చివరగా పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పని చేసిన సమయంలోను సిద్ధాంతాలకు, నైతిక విలువలకు కట్టుబడే పని చేశారు. అందుకు ఆయన వివాదాస్పదుడుగా పేరు తెచ్చుకున్నారు. బెంగాల్ గవర్నర్‌గా పని చేసిన రెండేళ్ల కాలంలో 'ఫైర్‌బ్రాండ్'గా గుర్తింపు పొందిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించారు. ఒకానొక సమయంలో గవర్నర్‌ను రీకాల్ చేయాలని మమత కేంద్రాన్ని కోరారంటే ఆయన ఎంత చండశాసనుడిగా పని చేశారో అర్థమవుతుంది. రాజ్యసభ చైర్మన్‌గా కూడా ఆయన ప్రతిపక్షాల ఒత్తిడికి ఏమాత్రం లొంగలేదు సరికదా కొంతమేరకు ప్రభుత్వానికి ఊరట కలిగించే నిర్ణయాలే తీసుకున్నారు. ఈ కారణంగా ఒక దశలో ధన్‌ఖడ్‌పై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కూడా ప్రతిపక్షాలు యోచించాయి. అలాంటి వ్యక్తి హఠాత్తుగా ఇప్పుడు అధికార పక్షానికి గిట్టని వ్యక్తిగా మారిపోవడం వింతే. ఆరోగ్య కారణాలవల్ల రాజీనామా చేసినట్లు చెబుతున్నా ఆయనకు పెద్దగా అనారోగ్య సమస్యలు ఉన్నట్లు ఎప్పుడూ వార్తలు రాలేదు. నెలరోజులు క్రితం కుమావో యూనివర్శిటీ స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన కాస్త అస్వస్థతకు లోనయ్యారు. ఆ తర్వాత ఆయన ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరారు. నాలుగు రోజుల తర్వాత డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లు ధన్‌ఖడ్ గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఆయన చలాకీగా, ఆరోగ్యంగా ఉన్నట్లే కనిపించేవారు. ఇదిలా ఉంటే ధన్‌ఖడ్ రాజీనామా చేసిన తర్వాత బిజెపి నేతలు ఎవరు కూడా ఆయనను పరామర్శించిన పాపానపోలేదు. ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఒక ప్రకటనతో సరిపెట్టారు. అంతటి ఉన్నత పదవిలో కొనసాగిన వ్యక్తికి రాజ్యసభ ఎంపిలు కనీసం వీడ్కోలు పలక లేదు. ఇటీవలి కాలంలో ఏ నేతకు కూడా ఇంత అవమానం జరగలేదేమో. ఇది బిజెపి ప్రభుత్వానికి ఏమాత్రం శోభనివ్వదనేది మాత్రం నిజం.